ప్రజాశక్తి

Vol. 3, no. 18

(Nov. 3, 1943)

బెజవాడ, 1943

Prajāśakti

Vol. 3, no. 18

(Nov. 3, 1943)

Bejavāḍa, 1943


Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 18 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ | పుచ్చలపల్లి సుందరయ్య తమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 3-11-43



సోవియట్ యుద్ధరంగంలో హిట్లరు

ఆంధ్రమహాసభ విశేషాలు

1913 నుంచి ఆంధ్రులం ప్రత్యేకరాష్ట్రం కొరకు ఆందోళన చేస్తున్నాం. అఖిలభారత స్వాతంత్ర్యోద్యమం ప్రజల్లో కల్గించిన చైతన్యంలోనుంచే వివిధ జాతుల జాతీయోద్యమాలు బయలుదేరాయి. 1905 లో బెంగాల్ జాతీయోద్యమం అన్నిటికంటె ముందుప్రారంభమయింది. తరువాత ఆంధ్ర ఉద్యమం వస్తుంది. అదేసమయంలో కన్నడ జాతీయోద్యమం కూడా, సంయుక్త కర్ణాటకోద్యమం, అను పేరుతో బయలుదేరింది. 1916 లో కాంగ్రెసు మహాసభ భాషాప్రయుక్తరాష్ట్రాలను గుర్తించి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసును యేర్పరచింది. కన్నడ–ఆంధ్ర సరిహద్దులను నిర్ణయించడానికి కేల్కార్ కమిటీని నియమించింది. ఈకమిటీ విచారణచేసి బళ్ళారిజిల్లాలో ఆదోని, ఆలూరు, రాయదుర్గ తాలూకాలు మాత్రమే ఆంధ్రులవనీ,తక్కినదంతా కన్నడ ప్రాంతమనీ నిర్ణయించింది. ఆప్రకారమే కాంగ్రెసు వ్యవహరించుతోంది. కాని అంతా మాదేనని వాదించే వితండులు కొలదిమంది ఆంధ్రులలోనూ, కన్నడులలోనూ, వున్నారు. వీరు సోదర ప్రజలమధ్య ద్వేషం రగల్చడం జరుగుతోంది.

23 వ ఆంధ్రమహాసభ బళ్ళారిలో జరుగుతుందనగానే ఆనగరం ఆంధ్రులదని రుజువు చేసికోడానికే అచట సభ జరుపుతున్నా మనే అనుమానం కన్నడసోదరులలో వ్యాపించింది. దీనికితోడు ఆంధ్ర జాతీయోద్యమానికే వ్యతిరేకులయిన మృత్యుంజయశాస్త్రి, లింగారెడ్డి గార్లు వగైరా 'బహిష్కరణ సమితి' పేరుతో ఆంధ్రమహాసభను బహిష్కరించాలని ప్రచారం సాగించారు. కన్నడ సోదరుల సందేహాలను తీర్చడానికి, వితండవాదుల ప్రచారాన్ని యెదుర్కోడానికి, ఈసమస్యయెడల కమ్యూనిస్టుపార్టీ దృక్పథాన్ని తెలియజేయడానికి, 22 వ తేదీని బళ్లారి చేరుకొన్నాను. పార్టీ దృక్పథాన్నితెలిపే కరపత్రాలను తీసికెళ్లాను.

నాయకులతో సంభాషణ

కన్నడ నాయకుడైన మహాబలేశ్వరప్ప గారితో మాట్లాడాను. ఆయన కేల్కారు కమిటీ నిర్ణయానికి బద్ధులమై వుంటామనీ, ఆంధ్రమహాసభ పెద్దలు ఒక్కమాట చెబితే సభను జయప్రదంగా జరుపడానికి తాము కూడా సహకారంచేస్తామనీ, అన్నారు. పార్టీ కరపత్రంలోని విషయానికి, ఆంధ్ర ప్రజలు తమ న్యాయమైనకోర్కెను గుర్తించుతున్నందుకు, సంతోషించారు.

ఆంధ్రమహాసభ అధ్యక్షులయిన సర్ విజయా గారిని కలసికొన్నాను. ఆయన కేల్కారు కమిటీ నిర్ణయం కాంగ్రెసుదనీ, ఆంధ్రమహాసభదికాదనీ తెలిపారు. మీదృక్పథాన్ని తీర్మానరూపంలో ప్రవేశపెట్టవచ్చునన్నారు. కన్నడ ప్రజలు యెక్కువగావున్న ప్రాంతాలు ఆంధ్రులకు అక్కరలేదని ఉపన్యాసంలో స్పష్టపరచారు.

రాయలసీమవాది, 'బహిష్కరణసమితి' సభ్యుడైన మృత్యుంజయ శాస్త్రిగారితో మాట్లాడాను. ఆయన చర్చించడానికే ఒప్పుకోలేదు. రాయలసీమ ఆర్థిక అభివృద్ధి జరిగిన పిమ్మటగాని ఆంధ్రరాష్ట్రం అక్కరలేదని వాదించారు. కాని రాష్ట్ర సంపాదన రాయలసీమార్థిక అభివృద్ధికి ఎలా వ్యతిరేకమో రుజువు చేయలేదు. రాయలసీమ అభివృద్ధికి రాష్ట్ర సంపాదన దోహదమిస్తుందని నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. కానివారు చర్చలోకి దిగడానికి నిరాకరించారు.

మహాసభకు వచ్చిన ప్రతినిధులతో యీ విషయమై చర్చించాను. హెచ్చుమంది కరపత్రంలోని విషయాన్నికాదనలేకపోతున్నారు. కాని,ముందుకొచ్చి కన్నడ సోదరులకు హామీయిచ్చి సందేహాలు తీర్చడానికి సిద్ధపడటం లేదు. ప్రతినిధులుగా కొలదిమంది మాత్రమే కాంగ్రెస్ దేశభక్తులు వచ్చారు. వీరిలో అధిక భాగం కరపత్రంలోని దృక్పథాన్ని అంగీకరించారు.

జాతీయ అహంకారాన్ని రెచ్చగొట్టే వితండవాదులు లేకపోలేదు. 16 వ తేదీ ఆంధ్రపత్రికలో ప్రకటించబడిన ఉేకుమళ్ళ రామచంద్రరావు ప్రకటనేవీరి వాదానికిపునాది. బళ్ళారిలో ఆంధ్రులే అధిక సంఖ్యాకులనీ. అలా రుజువుచేసికొంటామనీ వీరి వాదన. ఆహ్వానసంఘ ప్రముఖులలో యీ వాదనను బలపరచేవారున్నారు. అందుచేతనే కన్నడ సోదరుల అనుమానాలు మరింత బలపడ్డాయి.

మా ప్రత్యేక విలేఖరి

కన్నడుల ఆందోళన

ఈ సందేహాల ఫలితంగా కన్నడ ప్రజలు ఉద్రేకులయ్యారు. రోడ్లనిండా వ్యతిరేక నినాదాలు వ్రాశారు. మహాసభలను బహిష్కరించండని ప్రచారం చేశారు. వ్యక్తులు వ్యతిరేక నినాదాలున్న బాడ్జీలను ధరించుకొన్నారు. 500 వాలంటీర్లు పశ్చిమ కన్నడ ప్రాంతాల నుండి రప్పించబడ్డారు. అధ్యక్షునిఊరేగింపుని కలెక్టరు నిషేదించడంవల్ల నల్ల జెండాల ప్రదర్శనం కూడా జరుగలేదు. కాని, బహిష్కరణ బాడ్జీలు ధరించిన కన్నడ యువకులు సైకిళ్ళపై తిరిగేవారు. మహాసభకు వేసిన పందిరిలో ఆర్థిక సహాసభ జరుగుతుండగా, ఆపరణ బయట బహిష్కరణ వాదుల సభ జరిగింది. రెండింటికి షుమారు 1500 మంది ప్రజలు చొప్పున హాజరయ్యారు.

24, 25 తేదీలలో బళ్లారిజిల్లా కర్నాటక యువజనసభ జరిగింది. దీనిలో యిచ్చిన ఉపన్యాసాలు, తీర్మానాలు, వితండవాదుల జాతీయ దురహంకార ప్రచారం కన్నడ సోదరులను ఎలా రెచ్చగొట్టినదీ తెలుపుతుంది. స్వజాతీయాభిమానం అహంకారంగా మారినపుడు జరిగే దుష్ఫలితాలే యిచట స్పష్టంగా కనపడ్డాయి. కేల్కార్ నిర్ణయాన్ని రద్దుచేయాలనీ, బళ్ళారిజిల్లా అంతా–ఆదోని, ఆలూరు, రాయదుర్గా తాలూకాలతోసహా–కన్నడులదేననీ, కర్నూలు, అనంతపూర్ జిల్లాలలోని కొన్ని భాగాలుకూడ తమవేననీ, ఉపన్యాసాలిచ్చారు. ఆంధ్రులు ఒడంబడికకు విరుద్ధంగా కేల్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూన్నారు. కాబట్టి కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ పై నిర్ణయాన్ని మార్చి, పైమూడు తాలూకాలను కన్నడలో చేర్చాలని తీర్మానించారు. రాటోయే సంయుక్త కన్నడ మహాసభను ఆదోనిలో జరపాలని తీర్మానించారు. రెండు పక్షాలలోనూ జాతీయ దురహంకారాన్ని బోధించే సంకుచితవాదుల ప్రచారం వల్ల కలిగే చెడుగుకు, సోదర జాతులమధ్య పెరుగుతున్న ద్వేషానికి, యీ తీర్మానాలు నిదర్శనం.

బళ్లారి నగరంలో నివశించే ఆంధ్ర ప్రజాసామాన్యం రెండువైపులనుండి చెలరేగుతున్న యీ తగవును ఏవిధంగా చూస్తున్నారు? కొలదిమంది మధ్యతరగతి మేధావులు, వర్తకులు, ఆహ్వానసంఘంలోముఖ్యులు బళ్లారి ఆంధ్రులదేననే దృక్పథంలోవున్నారు. నేను తెలుగు రైతులను, బీదవారిని కలసికొని మాట్లాడాను. వారంతా బళ్లారిలో కన్నడులే హెచ్చుమంది వున్నారని చెబుతున్నారు. బళ్లారి కన్నడులదేనని అంగీకరించారు. తిమ్మప్పశెట్టి వగైరా యీ తగవు తెచ్చిపెడుతున్నారనీ, యిదివరదాకా ఒక వూళ్ళో కలసి మెలసి వుండే సోదర ప్రజల మధ్య ద్వేషాలు పెరుగుతున్నాయనీ, లేనిపోని బాధ వచ్చి పడుతూందనీ విసుక్కుంటున్నారు. వారు నిస్పృహచెంది ఏసభలలోనూ పాల్గొనలేదు.

రాయలసీమ ఆర్థికమహాసభ

23 తేదీకి వివిధ ప్రాంతాలనుండి ఆంధ్ర మహాసభకు 300 మంది ప్రతినిధులువచ్చారు. సిటీప్రెస్ అవరణలో మహాసభకు బ్రహ్మాండమైన పందిర వేయబడింది. పెండాల్ పేరు విజయనగర భవనం. కలెక్టరు నిషేదించుటచే ఉదయం జరగవలసిన అధ్యక్షుని ఊరేగింపు జరగలేదు. 9 గంటలకు చుండూరి రత్తమ్మ గారు పతాకోత్సవం జరిపారు. ఆంధ్రరాష్ట్రం కొరకు. భారత స్వాతంత్ర్యం కొరకు ఆంధ్రులు కృషిచేయాలని కోరారు.

రాయలసీమ ఆర్థికమహాసభ చుండూరి వెంకటరెడ్డిగారి అధ్యక్షతను 11 గంటలకు ప్రారంభమయింది. మద్రాస్ ప్రభుత్వ అడ్వైజరు శొంతి రామమూర్తిగారు ప్రారంభోపన్యాస మిచ్చారు. కరువు నివారణకు ప్రభుత్వంచేసిన పనులను గురించి తెలిపారు. అధిక పంటల స్కీము క్రింద మైనర్ ప్రాజెక్టులను ప్రారంభించుతూందనీ, చెరువులమరమ్మతులు చేయబడుతున్నాయని, చెప్పారు. తుంగభద్ర ప్రాజెక్టు విషయమై మద్రాస్ - బొంబాయి ప్రభుత్వాలకు, నైజాం మైసూరు సంస్థానాలకు మధ్య జరిగిన సంప్రదింపులను వివరించి, యుద్ధం పూర్తి అయినవెంటనే యిది ప్రారంభించవచ్చునని చెప్పారు. అధ్యక్షులు రెడ్డిగారు, మన దేశంలో మనిషి సగటు ఆదాయం 25/ రూ. మాత్రమేనని, అమెరికాలో వెయ్యి రూపాయిలు. బ్రిటనులో రూ. 500 ఆదాయమని తెలిపారు. పరిశ్రమలు వృద్ధిపొందినగాని,జాతీయాదాయం వృద్ధిపొందదనీ, రాయలసీమలో ఉక్కు-ఇనుము పరిశ్రమలకు మంచిఅవకాశముందనీచెప్పారు.

తరువాత ఒక రాయలసీమ గాంధీవాది లేచి యంత్రపరిశ్రమలు పెట్టుబడిదారులకు మాత్రమే లాభకరమనీ, యంత్రాలవలననే కరువులు, యుద్ధాలు వస్తున్నాయనీ, ఆర్థిక అభివృద్ధికి, యంత్ర పరిశ్రమలుమార్గంకాదనీ, చేతి పరిశ్రమలే తరుణోపాయమని చెప్పారు. అధ్యక్షుడు రెడ్డిగారిని పెట్టుబడి పెట్టి లక్షలు గడించుతున్నాడని విమర్శించాడు. తరువాత పి. వెంకటరామప్పగారు (రాష్ట్ర రైతుసంఘ సభ్యులు) పరిశ్రమాభివృద్ధికూడ జరుగవలసిందే నన్నారు. ప్రస్తుతం కరువునివారణకు ఖర్చుపెడుతున్న డబ్బును వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడే ప్రాజెక్టులకు ఖర్చుపెట్టా లన్నారు. ఈ విషయాలపైననే కడప రామసుబ్బమ్మగారు విపులంగా ఉపన్యసించారు.

తుంగభద్ర వగైరా ప్రాజెక్టులను నిర్మించాలనీ;మైసూరునుండి విద్యుచ్ఛక్తిసరఫరాచేయాలనీ; కాగితపు. దూది, మిల్లును; కృత్రిమ వెన్నకర్మాగారాన్ని నిర్మించాలనీ ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి. ఎం.ఎస్.యం. రైల్వే ఉద్యోగాల పంపకంలో ఆంధ్రులకు అన్యాయం జరుగుతోందనీ, అది తొలగించాలని తీర్మానించారు.

ఆర్థిక మహాసభను సర్వత్రంలో పోలీసువారి పెత్తనం అనవసరంగా జాస్తీగా చెల్లుబడి అయింది. కొందరి ప్రతినిధుల సామానులను సోదాకూడా చేశారు. కమ్యూనిస్టుపార్టీ కరపత్రాలను పంచుతున్న తాతినేని వెంకటేశ్వరరావును సబ్‌యిన్‌స్పెక్టరు అరెస్టుచేసి స్టేషనుకు పంపాడు. అచట కరపత్రాలు తనిఖీ చేసి. ఏమీ అభ్యంతరమైన విషయాలు లేకపోయినా పందిరిలో పంచరాదనీ, బయట పంచుకోమని హెచ్చరించి వదలిపెట్టారు. ప్రతినిధుల సంచులసోదా, పెండాలులో పోలీసుపెత్తనం, అసంతృప్తి కలుగజేసింది.

మహాసభ ప్రారంభం

24 వ తేదీ ఉదయం ఆంధ్రమహాసభ ప్రారంభమయింది. ఆహ్వానసంఘాధ్యక్షుడు తిమ్మప్పశ్రేష్ఠిగారు ప్రతినిధులను ఆహ్వానించుతూ ఉపన్యసించారు. తరువాత ఉయ్యూరు కుమారరాజాగారు ప్రారంభోపన్యాసమిచ్చారు.

తరువాత అధ్యక్షులయిన సర్ విజయానందగారు రెండోసారి తమను యెన్నుకొని విశ్వాసాన్ని ప్రకటంచినందుకు కృతజ్ఞతను తెలుపుతూ, తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. గతమహాసభ అనంతరం మరణించిన భారత ప్రముఖులయిన మహాదేవదేశాయి, జమ్నలాల్‌బజాజ్‌గార్ల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆంధ్ర ప్రముఖులయిన రాఘవేంద్రరావు, (మిగతా 8 వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 3-11-43

ముందు కొక అడుగు

నేడు మన దేశంలో సామ్రాజ్యవాదు లవలంబిస్తూన్న పాలసీ ఫలితంగానే బెంగాల్‌లో భయంకరమైన కరువు వ్యాపించినదని బ్రిటిష్ ప్రజాసామాన్యం తెలుసుకున్నారు. ఆ పాలసీకి స్వస్తిచెప్పి, భారతీయుల సహకారంతో ఆహారసమస్యను పరిష్కరించాలని వారు ఆందోళన చేస్తున్నారు. మన జాతీయనాయకుల విడుదలకై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. విదేశాలనుండి ఇండియాకు విరివిగా ఆహారపదార్థాలను పంపవలసిందని తీర్మానాలు గావిస్తున్నారు. మొన్న 21 వ తేదీని జరిగిన ప్రభువుల సభలో లార్డు స్ట్రాబోల్గి ఉపన్యసిస్తూ, బెంగాల్ కరువునివారణకై వెంటనే మిలిటరీ జోక్యం కలుగజేసుకొని, కరువు బాధితులకు సహాయం చెయ్యాలని సూచించాడు.

బర్మాపై తిరుగుదాడి జయప్రదం కావాలంటే, బెంగాల్ ప్రజల్ని కరువు రాక్షసినుండి కాపాడి, వారి మనోనిబ్బరాన్ని నిలబెట్టడం ఎంత ముఖ్యమో యుద్ధానుభవంగల కొత్త వైస్రాయి కూడా చక్కగా తెలుసుకున్నాడు.

లార్డ్ వేవెల్ ఇండియాలో అడుగు పెట్టగానే, బెంగాల్ క్షామపరిస్థితుల్ని స్వయంగా చూడ్డానికి ప్రచ్ఛన్నవేషంలో బయల్దేరాడు. కలకత్తా వీధులలోని ఆక్రందనాలు విన్నాడు. యితరజిల్లాలలో కంటె కరువు ఎక్కువగా వ్యాపించిన 'కాంటె' జిల్లాలో 160 మైళ్లదూరం కారులో ప్రయాణంచేసి, కొన్ని కరువునివారణ కేంద్రాలను పరిశీలించాడు. బెంగాల్ కరువు దృశ్యాలు కేవలం "అతిశయోక్తులు" కావని తెలుసుకున్నాడు.

తెలుసుకున్న వెంటనే, అతడు కార్యాచరణకు పూనుకున్నాడు. కొన్ని మాసాలుగా తిండికోసం కలకత్తాలో గుమిగూడిన నిరాధారుల్నందరినీ తక్షణమే "విశ్రాంతి గృహాల"కు తీసుకెళ్ళి, అక్కడ వారికి తగిన ఆహారం, వైద్యసహాయం కలుగజేసి, పూర్తిగా ఆరోగ్యవంతులయాక ఎవరి గ్రామాలకు వారిని పంపివేయడానికి ఏర్పాటు జరుగుతూన్నట్లు ప్రభుత్వ ప్రకటన తెలుపుతోంది రెండో విషయం: "అన్ని జిల్లాలలోకంటె ఎక్కువగా కరువు వ్యాపించిన జిల్లాలలో సైన్యం తనకున్న సాధన సంపత్తిని ఎంత సాధ్యమైతే అంత యెక్కువగా వినియోగించి, కరువు బాధితులకు సహాయపడాలని ఇండియా సర్వసేనానితో వైస్రాయి చెప్పాడు. ముఖ్యంగా, ఆహార పదార్థాలను ఒకచోట నుంచి మరోచోటికి తీసుకువెళ్ళే విషయంలోను, తాత్కాలిక కరువు నివారణ కేంద్రాలను నిర్మించే విషయంలోను, రిలీఫ్ స్టోర్సును స్థాపించే విషయంలోను, సైనికులు తోడ్పడాలి. కొన్ని ప్రాంతాలలో సైనికులే ప్రజలకు ఆహారంపంచిపెట్టి, వైద్యసహాయం చేయగల్గుతారు."ఆహార పదార్థాలను వెన్వెంటనే కలకత్తానుండి యితర క్షామపీడిత జిల్లాలకు తీసుకువెళ్ళే నిమిత్తం బెంగాల్ ప్రభుత్వానికి ఒక మేజర్ జనరల్ సహాయంకూడా యిచ్చారు. మిడ్నపూర్ సబ్‌ఏరియా కమాండర్ జిల్లాకలెక్టరుతో సంప్రతించి, క్షామ నివారణకు చేయగల సహాయమంతా చేయవలసిందని వైస్రాయి ఆజ్ఞాపించాడు.

ఈ విధంగా, కొత్తవైస్రాయి బెంగాల్ కరువు సమస్యయొక్క తీవ్రతను గుర్తించాడు. దాన్ని పరిష్కరించడానికి ఒకడుగు ముందుకువేశాడు. ప్రభుత్వం సైన్యానికి కొంటూన్న స్టాకులు విపరీతంగా పెరిగిపోవడం వల్లనే దేశంలో కరువు ఏర్పడిందని నేడు దేశంలో ప్రచారం జరుగుతోంది; చాలామంది ఇలాగే భావిస్తున్నారుకూడా. ఇట్టి పరిస్థితులలో సైనికులు, సైన్యాధికారులు, ముందుకువచ్చి, ప్రజల్ని కరువుబాధనుంచి రక్షించడానికి తక్షణమే పూనుకుంటే, అట్టి ప్రయత్నాలకు ప్రజలు, నాయకులు, ఉత్సాహంగా చేయూతనీయగలరు.

అయితే, సమస్యా పరిష్కారం దీనితోనేకాదు.

అన్నిటికంటె ముఖ్యం, జైళ్ళలోఉన్న కాంగ్రెసు నాయకులు ఆహారసమస్యా పరిష్కారానికై ప్రజల్ని సమీకరించుటలో ఎంత ఎక్కువ సమర్థులో వేవెల్ గుర్తించి, వారి విడుదలకై ధైర్యంతో మరొకడుగు ముందుకువేయాలి. దీనికితోడు దేశభక్తులు కూడ బెంగాల్ కరువు నివారణకై కృషిచేస్తున్న ప్రజాసంస్థ లన్నింటినీ సమన్వయపరచి, ఒకే సంస్థగా పనిచేసేటట్లు చూడాలి. దానికి ప్రభుత్వం పూర్తిగా సహాయపడేటట్లు చూడాలి. బెంగాల్‌రాష్ట్రమండలి కాంగ్రెసు, ముస్లింలీగ్, హిందూ మహాసభ, కమ్యూనిస్టుపార్టీ - మొదలైన సంస్థల ప్రతినిధుల్ని సమావేశపరచి, ఒక ఐక్య ఆహారకమిటీ యేర్పడేటట్లు చూడాలి.

సభలను భగ్నంచేయడం ఫాసిస్టుల సాంప్రదాయం

—పుచ్చలపల్లి సుందరయ్య

అక్టోబరు 19 వ తేదీనుండి 30 వ తేదీ వరకు కమ్యూనిస్టుపార్టీ సభ్యుల జనరల్‌బాడీ సమావేశాలు కృష్ణాజిల్లాలో జరిగాయి. వాటికి హాజరగుతూ జొన్నపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఉప్పులూరు, గుడివాడ, పామర్రు, బందరు, నూజివీడు, విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, గ్రామాలలో బహిరంగసభలలో ఉపన్యాసాలిచ్చాను. ప్రతి మీటింగుకు 500 మందికి తక్కువలేకుండా, 2000 వరకు కూడా, ప్రజలు వచ్చేవారు. మొత్తం 10,000 మంది వచ్చారు. చాలదూరాన్నుండికూడ ప్రజలు నడిచివచ్చి మీటింగుకు హాజరయ్యారు.

మన కాంగ్రెసునాయకులను విడిపించుకోడానికి మన ప్రజలు ఐక్యమై ఆహారసమస్య, దేశరక్షణకొరకు పనిచేయవలసిన అవసరం గురించి; కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని గురించి విపులంగా ప్రజలకుఉపన్యసిస్తూవచ్చాను.

మీటింగులలో అల్లరి

ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని, దేశరక్షణ, దేశనాయకుల విడుదల, దేశస్వాతంత్ర్య కార్యక్రమాన్ని, గూర్చి తెలపడం, తమ దుష్టప్రచారాన్ని కొనసాగించుకోడానికి అడ్డువస్తుందని కొంతమంది భయపడ్డారు. ముఖ్యంగా కాంగ్రెసుసోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకుల జపాను అనుకూల ప్రచారానికి, యుద్ధవ్యతిరేక విధ్వంసకచర్యల ప్రచారానికి, అడ్డుతగులుతుందనే ఆపార్టీలవారు, మరింతపట్టుదలతో, గల్లంతుచేసి ఈమీటింగులను సాగనివ్వకూడదని పనిచేశారు. గుడివాడ, బందరు, పట్టణాలలో యీగల్లంతు ఎక్కువగా జరిగింది.

మీటింగులలో గల్లంతుచేయడానికి వీరి పద్ధతి ఏదో గుడివాడ మీటింగులో వీరు చేసిన పనినిచూస్తే తెలుస్తుంది. మీటింగు అరంభంలోనే 20 ప్రశ్నలు పంపారు. వెంటనే చదివి జవాబు చెప్పాలని పట్టుబట్టారు. ఉపన్యాసం పూర్తిగ విననిపిదప సందేహాలుంటే అడిగితే జవాబు చెప్పడం సభా సాంప్రదాయం కాని, ముందుగానే ప్రశ్నలు వేయడం కాదని ఎంత చెప్పినా తమ అల్లరి మానలేదు. ప్రశ్నలు చదువమని పట్టుబట్టారు. ప్రశ్నలు చదివి, వీనిలో చాల ప్రశ్నలకు నా ఉపన్యాసంలోనే జవాబు వస్తుందనీ, రాని వానికి ఉపన్యాసం పూర్తి అయిన పిదప చెప్పెదననీ చెప్పాను. కాని, గల్లంతు చేస్తూ మీటింగునుండి లేచిపోవడానికి లేచారు. తమ ప్రశ్నలు తిరిగి తమకిచ్చివేయాలని పట్టుబట్టారు. పంపిన ప్రశ్నలు తిరిగి ఇచ్చివేయాలని వీరు పట్టు బట్టడం, ప్రశ్నలకు జవాబు వినాలని గాక, అల్లరి చేయాలనే ఈప్రశ్నలు వేసినట్లు స్పష్టపరుస్తోంది. ఆప్రశ్నలనుతిరిగి ఇవ్వడానికి నిరాకరించాను. ఇంకా అల్లరి ఎక్కువ చేయసాగారు. కోపంతో ఆ ప్రశ్నలనన్నిటినీ చించి వారిమీద పారవేశాను. కోతి పుండుకు తేలుకాటుకూడ తోడయింది. రాత్రి 7 గంటల వరకు అల్లరిచేస్తూనే ఉండినారు. సభ జరగలేదు.

పామర్రులో మధ్యమధ్య ఒకటి రెండు అడ్డు ప్రశ్నలు వేసినా, ఉపన్యాసం పూర్తి అయ్యే వరకు, కాంగ్రెసు వాదులు, నాగిరెడ్డిగారు తదితరులు, అల్లరిలేకుండా చూచారు. ఉపన్యాం పూర్తిఅయిన వెంటనే వేసిన ప్రశ్నలకు ఒకగంట సేపు జవాబుచెప్పాను. రాత్రి 12 గంటలకు సభ పూర్తిఅయింది. తాము పంపెన ప్రశ్నలు తిరిగి ఇచ్చివేయమని పట్టుబట్టి తీసుకవెళ్లారు. మీటింగుపూర్తి అయ్యేటప్పుడు రెండుమూడు చిన్న రాళ్ళుకూడ పైనబడ్డాయి.

బందరు పట్టణంలోకూడ స్థానికంగా కొందరు, గుడివాడలో గల్లంతుచేసినవారిలో కొందరు తిరిగి అచ్చట తయారై మళ్ళా ప్రశ్నలు పంపారు. ఉపన్యాసం పూర్తి అయిన తరువాత జవాబుచెప్పుతానని ఎన్ని పర్యాయములు చెప్పినా, ఉపన్యాసం జరిగేటంత సేపూ అడ్డు ప్రశ్నలువేసి అల్లరిచేస్తూవచ్చారు. 6-30 కు అరంభించినమీటి గు రాత్రి 8-30 వరకు, ఈగల్లంతుసాగుతున్నా జరిగింది. ఈగల్లంతు చూచి పోలీసులు అక్కడకు వచ్చారు. దానితో మధ్య మధ్య 5 నిమిషాలకొకసారి లేచి కొంత అల్లరి సాగిస్తూ వచ్చినా, కాస్త జాగ్రత్తగా మెలిగారు. గల్లంతుచేయడమే తమ ఆశయంగా పెట్టుకొనివచ్చి, మీటింగు జరిగేటంత సేపు అల్లరిచేస్తూ వచ్చిన వీరి ప్రశ్నలకు జవాబు చెప్పడం, మరింత అల్లరి జరగడానికి కారణమవుతుందని మీటింగు పూర్తిచేశాం. ప్లాటుఫారంచుట్టూ క్రమ్మేసి కొట్టేటట్లు ముందుకు వచ్చారు. ఈ అల్లరిమూక. వాలంటీర్లు వీరిని ప్లాటుఫారందగ్గరకు రాకుండ నెట్టివేశారు.

అల్లరి లేకుండా చేయలేమా?

మీటింగులలో అల్లరిచేయడం, గల్లంతుచేసి సాగనివ్వకుండా చేయడం, గొప్ప విషయంకాదు. కొద్దిమందైనా అల్లరిచేసి మీటింగు సాగనివ్వకుండా చేయవచ్చు. అల్లరి చేసేవారిని మీటింగునుండి బయటికినెట్టివేయడమే ఈ అల్లరి జబ్బుకు మందు. అలాచేయడమంటే!

పోలీసులువచ్చి జోక్యం కలిగించుకొని, మీటింగునే సాగనివ్వకుండా చేయడానికి అవకాశముంది. అంతేగాక, శాంతి భద్రతలకు భంగం కలుగుతుందనే సాకుతో, బహిరంగ సభలనే నిషేదించడానికి అవకాశముంది. అందుచేతనే కమ్యూనిస్టులం అల్లరిచేసే ఈ కొద్ది మూకయెడల చాల సహనంతో మెలగవలసి వచ్చింది. బందరులో మేము పిలవకపోయినా; గల్లంతుగా ఉండేటప్పటికి పోలీసులు వస్తే, వాళ్ళసహాయంతో మీటింగుచేస్తూ జరుపుకున్నామనివారుదుష్ప్రచారంచేస్తూన్నారంటే ఎంతజాగ్రత్తగా ఉండాలో తెలుస్తుంది.

అల్లరి మూకను నెట్టివేస్తే, కమ్యూనిస్టులు మమ్మకొట్టారని ప్రజల సానుభూతి సంపాదించుకో వచ్చునని ఈ అల్లరిమూక, వారి వెనకాల ఉండే పార్టీల ఉద్దేశం. అలా నెట్టివేయకుంటే గల్లంతుచేసి, ప్రశ్నలకు సమాధానం చెప్పనివ్వకుండా చేయడంవల్ల, కమ్యూనిస్టులు, వారినాయకులు, ఎందుకూ చేతగాని అసమర్థులని తాము ప్రజలలో బడాయిలు చెప్పుకోవచ్చునని వీరిఉద్దేశం.

మీటింగులలో అల్లరిచేయడం ఫాసిస్టు పద్ధతి

ఇలా మీటింగులలో అల్లరిచేయడం, ఫాసిస్టుల పద్ధతిగాని, స్వాతంత్ర్యం కోరేవారి పద్ధతి కాదు. ప్రజాప్రభుత్వం కోరేవారి పద్ధతికాదు. కాంగ్రెసు పద్ధతికాదు. ఈ మీటింగులలో అల్లరిచేసిన వారెవరో కొంచెం పరిశీలిస్తే యీ విషయమేరుజువవుతుంది. ఈరోజు నాయకుల విడుదల కాదు; ప్రధాన సమస్య జాతీయ ప్రభుత్వంకోసం విధ్వంసకచర్యలకు ప్రజలను సమీకరించడమే ప్రధాన సమస్య అనే ఈ భూపతి, అతనికాంగ్రెసుసోషలిస్టుముఠా, యీ అల్లరికి ప్రధాన కారణం. ఈఅల్లరిలో కమ్యూనిస్టులను వ్యతిరేకించే కొంతమంది కాంగ్రెసువాదులు కూడ ఉండవచ్చు. కాని, యీఅల్లరికి అగ్రతాంబూలం భూపతి ముఠాది. భూపతి, గుడివాడ సభలో హాజరు. కేతవరం లక్ష్మీనరసింహంగారు, కమ్యూనిస్టు నాయకులు చెప్పేది వినాలి, మీటింగులలో గల్లంతు చేయడం కాంగ్రెసువాదుల సాంప్రదాయం కాదు; గుడివాడ పౌరులకు గాని, కాంగ్రెసు వాదులకు గాని, (7 వ పేజీలో చూడుడు)

★ చిన్న కథ

కరువు ఫలితాలు

డాక్టరు రాంబాబు

ఆవచ్చే ఆదివారం సెలవు కనుక, ఆ రోజున రెండు మాసాలకు సరిపోయే బియ్యం మొదలగు ఆహారపదార్థాలుకొని దాచుకొంటే, పెరిగిపోతున్న ధరలకు కొంతవరకు తట్టుకో వచ్చునని ప్రమదబాబు నిశ్చయించుకున్నాడు. తీరా ఆఆదివారం వచ్చేసరికి ఎప్పుడూ అను కోని పని తగిలింది; యుద్ధానసరాలను అవస రంగా గోనెసంచులు త్వరత్వరగా సప్లయి చేయాలి కాబట్టి, ఫ్యాక్టరీలో అందరినీ సెల వుల్లోకూడా పనిచేయాలన్నారు. ఆరోజున అదనపుకూలీ, అదనపు జీతమూ ఇస్తా మన్నారు. అందుకు దాదాపు అందరూ అంగీక రించారు. ఫ్యాక్టరీ గుమాస్తాల్లో ఒకడైన ప్రమదబాబుకూడా అందుకు అంగీకరించాడు.

తాను ఏపనిచేయడానికైతే ఆసెలవు నాడు కూడా పనిచేయడానికి ఒప్పుకొన్నాడో, అది అంతా పూర్తయింది. కాని యింకా ఇంటికి వెళ్ళే సమయంకాలేదు. ఇదివరకల్లా విశ్రాం తిగా గడిపే ఆ ఆదివారం అలసిపోయి రాత్రిభాగాన చేయవలసి వచ్చింది. ప్రమదబాబు తన పుస్తకాలన్నీ సర్దుకొని "రేపు నేను తప్పక సెలవుపెట్టి బజారులో ఆహారపదార్థాలు కొనుక్కోకపోతే, ఇంక ఎప్పుడూ కాదు. ఇంతవరకూచేసిన నాఅశ్రద్ధవల్లనే ఇప్పటికే ధరలు చాలా పెరిగిపోయాయి. ఇంట్లో అన్ని సరుకులూ అయిపోయాయి, కూడా" అనుకొంటున్నాడు.

ఫ్యాక్టరీ జవాను టంగుటంగున ఆరు గంటలు కొట్టాడు. ఆజవాను ఏదోవిచారంతో వున్నట్టు కనుపించాడు. ఎందుకతను విచా రంగా ఉన్నాడో ప్రమదబాబుకు తెలుసు. ఆదివారంనాడు పని చేయడం అతనికిష్టం లేదు. "నీవు సెలవులలోకూడా పనిచేయక పోతే, నీస్థానంలో పనిచేయడానికి మరోకూలీ సిద్ధంగా ఉన్నాడు," అని మేనేజరు బెదిరించి నప్పటినుంచీ ఏదో నిస్పృహతో అతనుంటు న్నాడు.

"బేచారాం!" అని ప్రమదబాబు పిలవగానే అతను, "సెలవుల్లో పనిచేయడం ఈకరువు రోజుల్లో కష్టంగా ఉందండీ! ఇవ్వాళ మా అమ్మాయిని చూడ్డానికి వెడదామనుకొం టున్నాను...." అంటూ వచ్చాడు.

"ఏవూరేమిటి?" అని అడిగాడు ప్రమద బాబు.

"ఏవూరని చెప్పనుబాబూ! మిడ్నపూర్ జిల్లాలో ఉంది, ఒక చిన్నగ్రామం. అది ఆ మధ్య వరదలకు కొట్టుకుపోయింది. అందులో మా అమ్మాయిగారింట్లో నిదరపోతున్న మా పెద్ద మనవరాలు కొట్టుకుపోయింది బాబూ! ఇంకో చంటిపిల్లాడు, తల్లి మిగిలారు. మా కష్టాలు ఏంచెప్పనుబాబూ!" అంటూ చెప్పుకు వస్తున్నాడు.

"ఆ! ఆ! ఇదివరకు ఆసంగతి చెప్పా వుగా?"

"ఆఁ అంతేకాదు బాబూ! వాళ్ళక్కడ తిండిలేక చస్తున్నారు. వాళ్ళకోసం చాటుగా ఒక మణుగు బియ్యందాకా కొని దాచాను. అవి తీసుకుపోదామంటే నాకు సెలవు లేదు. వాళ్ళు చచ్చిపోయేటట్లున్నారు," అని కంట నీరు పెట్టుకొన్నాడు.

"ఇదిగో, బేచారాం! నువ్వు విచారించకు. నీకిప్పుడప్పుడే మేనేజరు సెలవీయడు. నీకు సెలవుదొరికే ఉపాయం నే నాలోచిస్తాను; ఒక్క వారంరోజు లోపిక పెట్టు," అనిఓదార్చు తున్నాడు ప్రమదబాబు.

ఇంతలో బజారు గుమాస్తా వస్తూనే— "ఇక మనం కలకత్తాలో బ్రతకలేం! నిన్న మణుగు యిరవైరూపాయలు చెప్పిన బియ్యం, యివ్వాళ ముప్పైరూపాయ లిస్తామన్నా దొర కలేదు. ఒక్కమణుగు బియ్యం సంపాదించే సరికి ప్రాణాలు బేజారెత్తాయి. ఇక మన మిక్కడ బ్రతకలేం ప్రమదబాబుగారూ! ఆహారపదార్థాల ధరలనుబట్టి మన జీతాలూ, కూలీ, పెంచమని మన మందరం ఒకటై అడగాలి. ఇదివరకు పదిసార్లడిగితేనేగాని ఇప్పుడున్న జీతాలు పెంచారుకారు. మీరేమం టారు?" అని అడిగాడు.

ప్రమదబాబు మాట్లాడలేదు.

బేచారాంకి వాళ్ళమ్మాయి వున్న గ్రామం మునిగిపోయిననాటిదృశ్యం కళ్ళ యెదుటకు వచ్చింది. కూతురు తనబిడ్డకోసం గోడుగోడున తన్ను కౌగలించుకొని యేడుస్తున్నట్టనిపిం చింది—"అమ్మో! మణుగు ముప్పైరూపా యిలే! ఇకమాలాంటి బీదావిక్కబ్రతికేదెలా?" అని గోడనున్న గడియారం చూచాడు.

ప్రమదబాబు కొంతసేపటికి గుక్కత్రిప్పు కొన్నట్టు—"ఈధరలు యెలా పెరిగిపోతున్నా యంటారూ?" అన్నాడు ఎంతోఆశ్చర్యంగా.

"ఎలా పెరిగిపోతున్నా యేమిటండీ! సత్యేంద్రనాధబాబు వేయి బస్తాల ధాన్యం మొన్న పదిరోజులక్రిందట కొన్నాడు. ఇంత ధాన్యాన్నిఏమిచేశాడో, ఇవాళ అడుగుతే- "ఒక్క వడ్లగింజయినా అమ్మకానికి నావద్ద లేదు," అని ఖచ్చితంగా చెప్పివేశాడు. అతనే కాదు; పెద్ద పెద్ద వర్తకులంతా ఇలానే చెబు తున్నారు. కొన్న సరకంతా ఏమిచేస్తున్నారో తెలియడంలేదు. ధరలకు రెట్టింపు ఇస్తే చాటుగా అందజేస్తున్నారు. ఇదంతా వర్త కులు కాకపోతే మరెవరు చేసేది," అన్నాడు. అతనిలో ఉద్రేకం, బాధ ప్రస్ఫు టమయాయి.

అలా అనగానే ప్రమదబాబు మనస్సు చివుక్కుమంది. గతయుద్ధసమయంలో పెద్ద వ్యాపారంచేస్తూ ధరలు పెరుగుతాయని దిట్టంగా సరుకులు దాచివేసి, చివరికి క్రమంగా దరలు దిగిపోయేసరికి దివాలాతీసి, చిరకాలం మంచంపట్టి చనిపోయిన తన తండ్రిని దూషించినట్టనుకొన్నాడు. వ్యాపారులే క్షామ కారకులనగానే తన్నే అన్నట్టనుకొన్నాడు. అయినా అతను తొందరపడలేదు. బజారు గుమాస్తాను ఏమీ అనలేదు. "మన జీతాలు పెంచే ప్రయత్నాలు తప్పక చేయాలి. కాని అందరూ కలసి చేయకూడదు; ఎవరిజీతం పెంపుదలగూర్చి వారే ప్రయత్నాలు చేసు కోవాలి," అని తన అభిప్రాయం ప్రమదబాబు చెప్పివేశాడు.

"అది ఎలా సాధ్యమౌతుందీ? కాస్త మీరు ఆలోచించండి! అలాగైతే మనకు కూడా క్షామం భయంకరంగా వ్యాపిస్తుంది. మన అవసరాలగూర్చి అందరం కలసి పని చేయాలి!" అని బజారు గుమాస్తా చెబుతుం డగానే బేచారాంవెళ్ళి ఏడుగంటలు కొట్టాడు.

సోమవారంనాడు తనకు సెలవిచ్చిన మేనేజరును స్తుతించుకొంటూ ప్రమదబాబు పెట్టెలోనిడబ్బుతీసి లెక్కపెట్టుకుంటున్నాడు. నెలరోజులక్రిందట బంగారంధర ఎక్కు వగా ఉందంటే, భార్యమెడలో మూడుకాసుల నగను అమ్మివేసి ఆ డబ్బును జాగ్రత్తచేసి ఉంచాడు. ఏమైనా ఆహారపదార్థాలు చౌకఅవు తాయేమో—రేపూమాపూచూచి కొనివేద్దామని అతని అభిప్రాయం. నానాటికి పెరగడమే కనబడడం, వినబడడం అవుతుంది కానీ, తరిగిన వార్తలు రావడంలేదు. పోనీ మళ్లా బంగారం కొని నగ నగగానే ఉంచుదామంటే బంగారం ధర పెరిగిపోయింది.

నగ అమ్మినరోజున లెక్కవేసుకొంటే పదిమణుగులబియ్యం రాగా, కొన్ని ఎల్లర ఖర్చులకు సరిపడేటంత డబ్బు ఉంటుందను కున్నాడు. కాని తాను ధరలు దిగుతాయనే ఆశతో అశ్రద్ధచేసి కొనకపోవడంవల్ల, ఇప్పటి ధరలప్రకారం పదిమణుగుల బియ్యం రావు: చిల్లరసరుకులకు సరిపడినంత డబ్బు ఉండదు. ఆహారపదార్థాలు కొనకుండా అశ్రద్ధ చేసినందుకు తన్నుతాను నిందించుకొన్నాడు. ఆ అశ్రద్ధకు తనకు అధికధరలుపెట్టి ఆహార పదార్థాలు కొనడమే తగిన శిక్షఅనుకొన్నాడు. ఎంత తప్పుపనిచేశానని విచారించాడు.

ఇక విచారించి లాభం లేదనుకొని, డబ్బం తా జేబులో పెట్టుకొని వంటయింటిలో నున్న ఇల్లాలికడకు పోయి—"ఇదిగో! ఇంటి వద్ద బియ్యంపెట్టి యేసరకూ కొనకు. ఒక్క గింజకూడా బిచ్చగాళ్ళకు వేయవద్దని నీ కెన్ని సార్లో చెప్పాను. ఈ సంసారం యీదలేక నాదుంపతెగుతూ వుంది." అంటూ కండువా వేసుకొని గడియారంవంక చూచాడు. పదకొండుగంటలు దాటింది. "బజారుకు పోయేసరికి పన్నెండు దాటుతుంది. త్వరగా వెళ్ళకపోతే కొట్లవద్దనుంచి షాహుకార్లు ఇంటికిపోతారు. ఇక యజమానుల ఆదరణ, గౌరవం సంపాదించాలని గుమాస్తాలు సరు కులకు యింకా యెక్కువ ధరలు చెబు తారు. త్వరగా వెళ్ళాలి!" అనుకొని త్వర త్వరగా వీధి తలుపులు తీసి బైట పడేసరికి, ఒడిలో యేదోమూటతో, శరీరాన్నంతా కప్పని గుడ్డపీలికతో, ఒకజీర్ణకంకాళం అతనిగుమ్మం ముందు ఆశాదృక్కులతో పడివుంది. ప్రాణ భిక్ష వేడుకొంటూ వుంది. దిన దిన దృశ్యమే కనుక, "ఫో" అని కసరివేసి ప్రమదబాబు వెళ్ళిపోయాడు.

బజారు!

మామూలురోజుల్లో అష్టైశ్వర్యాలతో తుల తూగుతుండేది. నేడూ అలా లేకపోలేదు. దీనుల ఆర్తనాదాలతోటి, శవాల కంపుతోటీ, యుద్ధ యంత్రాల పరుగులతోటీ, విశ్రాంతి లేకుండా ఉంది.

ప్రమదబాబు తన క్కావలసిన మొత్తం బియ్యంకోసం - ఎంతధరపెట్టి కొందామన్నా దొరకలేదు. ఈలోగా గుండెలు తినివేస్తున్న ఎన్నో క్షామ దృశ్యాలు చూచాడు. నడి నెత్తిమీద ప్రొద్దు దాటిపోయింది. ప్రొద్దున పోసిన కాఫీ జీర్ణమైపోయి, నీరసంగా ఉంది. చెమటలు పోస్తున్నాయి. ఇప్పుడతనిహృదయ ఫలకంమీద క్షామ బాధితుల దృశ్యాలు చిత్రింపబడుతున్నాయి. అతని కంటిలో తన యింటిముందు జీర్ణకంకాళం ఆడుతూ ఉంది. అతని మెదడులో ఎన్నోక్షామమూర్తులు చిందులు త్రొక్కుతున్నాయి. ఇక తిరగలేక పోయాడు. గత దినం బజారు గుమాస్తా అన్న మాటలుప్రమదబాబు జ్ఞప్తికి వచ్చాయి. వాటిని గూర్చి ఆలోచన అప్పుడతనికి కల్గింది.

తిరగ్గా, తిరగ్గా, ఒక అరమణుగు బియ్యం ప్రోగయ్యాయి. అదయినా మణుగు చాలా ధరపెట్టి కొన్నాడు. ఇంకా డబ్బు చాలా మిగిలిపోయింది. పోనీ ఎక్కువ ధరతోనే కొందామన్నా ఎక్కువ బియ్యం ఒక్కసారిగా దొరకడంలేదు. డబ్బు ఉండి ఎందుకూ కొరగాకుండాపోయింది; జేబులో చెమటచేత తడిసితోతూఉంది. త్వరత్వరగా ఇంటికివచ్చే సరికి పూర్వజీర్ణకంకాళమే, తనకోసమే ఎదురుచూస్తున్నట్లు యింటికవతలగా చచ్చి పడి ఉంది.

ప్రమదబాబు మొదట బజారువెళ్ళేటప్పుడు ఆమె ఒడిలోచూచినమూటను ఒకకుక్కలాగి గుడ్డ చించివేసింది. దానిలో ఒకసంవత్సరం పసిపాప చనిపోయివున్నాడు. ఆమెఎవరో! తన్ను ప్రాణదానం చేయమని కొనఊపిరితో అడిగింది. కాస్త అన్నం పెట్టి తాను ప్రాణదానం చేయలేకపోయి నందుకు చాల విచారించాడు. అతని బుర్రను కొబ్బరికోయితో క్షామమూర్తులందరూ గీరు తున్నట్లనిపించింది. బజారున నడిచిపోయే అనేకమంది ఆశవాన్ని చూడ్డంలేదు. ఈ సంగతి చెబితే అతని భార్యనైతం - "రోజూ జరుగుతున్నవేగా?" అని ఊరుకొంది.

తన ఇంటిముందు చనిపోయిన వారిని గూర్చే విచారిస్తూ ప్రమదబాబు ఇంటిలో అలా కూర్చుండిపోయాడు. కొంతసేపటికి రెండు కాగితాలు పట్టుకొని బేచారాం - "ప్రమద బాబుగారూ! ఆహారపదార్థాలనుబట్టి జీతాలు, కూలీలు, పెంచాలని అందరూ సంతకాలు చేసి ఈ అర్జీని ఫ్యాక్టరీ యజమానులకు పంపుతున్నారు. మీచేతకూడ సంతకాలు చేయించుకొని రమ్మని బజారు గుమాస్తాగారు పంపారు. మళ్ళా గంటకొట్టే లోపల నేను వెళ్ళాలి. దయచేసి సంతకంచేయండి." అంటూ వచ్చాడు.

"చాలా మంచిపని. అందరూ కలసి పని చేస్తేనేకాని ఈఆహారసమస్య తీరేటట్టులేదు. ....అదిగో వీధిలో ఆశవాన్ని చూచిరా," అన్నాడు ప్రమదబాబు.

"ముందు మీరు సంతకంచేయండి. ఈపని మీకు మనస్ఫూర్తిగా ఒప్పుదలేనా? అని మిమ్మల్ని బజారు గుమాస్తాగారు అడగ మన్నారు."

"ఆఁ ఇన్ని ఘోరదృశ్యాలు చూస్తూ- వాని నివారణకై ప్రయత్నించకుండా- యిలా తిండికి కరువవ్వాల్సిందా? అందరూ కలసి జీతాలు పెంచమని ఒక్కసారిగా అడగవల సిందే! ఇప్పుడు నాకు బజారులో కేశవబాబు కనపడ్డాడు. వాళ్ళ ఫ్యాక్టరీలో అందరూ కలసి అడిగితే జీతాలూ, కూలీలు, పెంచారని చెప్పాడు." అంటూ సంతకంచేశాడు.

ఆ కాగితాలను జేబులోపెట్టుకొని బేచారాం గోడప్రక్కన పడున్న శవాన్ని నిదానించి చూచీ చూడగానే, ఆక్రందనం చేయడం మొదలు పెట్టాడు. దూరంగా కుక్క పడ వేసిన బిడ్డను తీసుకువచ్చి ముద్దుపెట్టుకొంటూ ఏడుస్తున్నాడు.

ప్రమదబాబుకు అదంతా అగమ్యంగా తోచింది. ఆ చనిపోయిన శవం బేచారాం కూతురనీ, ఆ బిడ్డ ఆమె కొడుకనీ, బేచారాం ఏడుపువల్ల అర్థమయింది. గత రోజున బహుశా ఈ అమ్మాయినిగూర్చే చెప్పి ఉంటాడు. ఆఁ నిజంగాఅంతే! పాపం!

బేచారాం దుఃఖాన్ని ప్రమదబాబు చూడ లేకపోయాడు. చివరికి తాను ఓదార్చవలసి నంతగా కూడా ఓదార్చలేకపోయాడు. బేచా రాం ను ఇంటిలోకి తీసుకురావడం అతనికి సాధ్యంకాకుండాపోయింది. బేచారాం కూతురు శవంపై పడి ఏడుస్తూన్నాడు. జనం చుట్టూ మూగి చూస్తున్నారు. ప్రమదబాబు ఇంటి లోకి పోయి కూర్చుని విచారిస్తున్నాడు. నాలుగు మూలలనుంచి క్షుధార్తులువచ్చి తన పీక నొక్కివేస్తున్నట్లు బాధపడుతున్నాడు.

★ రైతుసమస్యలు

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయంఎలా?

పొగాకు పండించే రైతులకు కొత్తసలహాలు

గుంటూరుజిల్లాలో రైతులు గత సంవత్సరం సుమారు 80 వేల యకరాలలో నాటు పొగాకు, 80 వేల యకరాలలో వర్జీనియా పొగాకు పండించారు. కాని, జిల్లాయందలి పల్నాడు, వినుకొండ తాలూకాలలో ప్రజలు తిండిలేక, నానాఅవస్థలుపడుతూంటే, రాయలసీమ - మలబార్ - బెంగాల్ ప్రజలు కరువువల్ల ప్రాణాలు పోగొట్టుకొంటూంటే, రైతులు కేవలం పొగాకు పంటకు ప్రాధాన్యత యివ్వడము సరికాదనే విషయం గుంటూరుజిల్లా రైతు సంఘం గుర్తించింది. పొగాకు విస్తీర్ణాన్ని తగ్గించి, కొద్ది విస్తీర్ణంలోనే ఎక్కువ ఆదాయం పొందుటకు, ఆ జిల్లా రైతుసంఘాధ్యక్షులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

1. పొలంలో కలుపు, నయ్యిపోగు, మట్టిలో కలవగా మిగిలిన చెత్తను తీసివేసి, బుడ్డలేని మేలురకపు నారు నాటితే, పైరును పుకిబనుండి కాపాడవచ్చు.

2. గ్రామాలలో వ్యాపారస్తులు కట్టెధరను విపరీతంగా పెంచి, ముందుగానే ఆర్డర్లు తీసుకొంటున్నారు. బొగ్గు, కట్టె, రైతులకు చౌకగా సరఫరా చేయవలసిందని ప్రభుత్వం పైన, బొగ్గు కంపెనీలపైన ఒత్తిడి తేవాలి. ఫారెస్టు కూపులను రైతులు సమిష్టిగా కొనునట్లు గ్రామ రైతుసంఘాలు కృషిచేయాలి.

3. సాధారణంగా, పొగాకుకాడలో నీరు ఉండుటవల్ల 160 డిగ్రీల టెంపరేచర్ ఉంటేనే ఆకు కాలుతుంది. కాని, ఇంత టెంపరేచర్ ఉంటే, 5-6 నెంబర్ల తక్కువరకం పొగాకు చాల తయారవుతుంది. ఈ నష్టం రాకుండా చూచుటకు గుంటూరు మార్కెటింగ్ కమిటీ ఎడ్వైజరు ఒక యంత్రాన్ని కనిపెట్టారు. దానిపేరు "రిబ్‌రిడ్డర్". ఇది కాడను వొత్తి, నీటిని లాగుతుంది. అందువల్ల 130 డిగ్రీల టెంపరేచరుతోనే ఆకు కాలుతుంది. దీనిఖరీదు సుమారు రు 50. మార్కెటింగ్ కమిటీద్వారా దీన్ని పొందవచ్చు. బొగ్గుకు, కట్టెకు ఏర్పడ్డ కొరతను ఈ యంత్రం చాలావరకు తగ్గిస్తుంది. పొగాకురైతులు ఈ సూచనల్ని పాటిస్తూ, ఆహార పంటలకు ఎక్కువ విస్తీర్ణాన్ని వినియోగించవలసిందిగా జిల్లా రైతు సంఘాధ్యక్షులు కోరుతున్నారు.

తిరువూరు తాలూకాలో పొగాకు పంటవల్ల నష్టం

తిరువూరుతాలూకా (కృష్ణా) జమీందారీ ప్రాంతం. చెరువులపై పెత్తనంఅంతా జమీందార్లది. వాటికి సరియైన మరమ్మతులులేక, ప్రతియేడు పంటలు ఎండిపోతున్నాయి. పైగా గత 3 సంవత్సరాలనుండి చెరువుల లోదట్లయందు వర్జీనియా పుగాకువేస్తున్నారు. ఇది ఆహారపంటలకుచాలానష్టం. ఎందువల్లనంటే, పంట పూర్తికాకముందు నీరు తీసివేస్తారు. సకాలంలో నారుపోసుకోవాలంటే పాతనీరుండదు. తొలకరివానలకై రైతులు వేచిఉండాలి. కొత్తనీరు వచ్చినతరువాతే నారుపోయుట, నాట్లువేయుట, జరుగుతోంది. దీనివల్ల వ్యవసాయం 2 నెలలు వెనుకబడి, పంట తగ్గిపోతోంది. ఉదాహరణకు, రోటవడె చెరువు లోదట్టులో పొగాకువేయుటవల్ల లోగడ పంటకంటె 2500 బస్తాలు తగ్గింది. నవంబరు నెలాఖరులోగా పుగాకువేయుటకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పెషలార్డరుపంపి, పుగాకుపంటను ఆపుచేయించవలసిందనీ, చెరువులమరమ్మతు సక్రమంగా చేయించి అవసరమైనచోట్ల వాగులు, వరదకాలువలు చెరువులకు మళ్ళించే ఏర్పాటు చేయవలసిందనీ, తిరువూరు తాలూకా రైతు సంఘకార్యదర్శి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎరువుసప్లయి చాలడంలేదు

ఒంగోలుతాలూకాలో కనపర్తి, చుక్కలవారిపాలెం, మొదలైన గ్రామాలలో దాదాపు 300 యకరాల మాగాణి (మిగతా 4 వ కాలంలో)

ఈ అన్యాయం అంతంకావాలి

పునాసపైర్లు వచ్చాయనే మిషమీద కడప చుట్టుపక్కల 11 గ్రామాలలో ఈ మధ్య రేషనింగు రద్దుచేశారు. దీనికి తోడు ఆప్రాంతంలోఇప్పుడు మరోఅన్యాయంజరుగుతూంది.

ఆప్రాంతాల్లోమిగిలిన కొద్దిడిపోలలోకూడ ఈమధ్య వారం పదిరోజులు జొన్నలు, రాగులు మాత్రమే యిచ్చారు. తరువాత కొన్నాళ్లు తడిసి ముక్కిపోయిన బియ్యం యిచ్చారు. ఇప్పుడేమో వడ్లు, అందులోనూ కొత్తవి - ఇస్తున్నారు.

ఇంతవరకు రేషనింగ్ పద్ధతిప్రకారం ఈ డిపోలలో మనిషికి ¼ శేరు బియ్యం అమ్మేవారు. ఇదే చాలటంలేదని ఆహారకమిటీలు ఆందోళనచేస్తున్నాయి ఇప్పుడుఅమ్ముతూన్న వడ్లు దంచుకొంటే వచ్చేబియ్యం ¼ శేరుకన్నా తగ్గుతున్నాయి. పైగా సరిగా అన్నంకావడం లేదు. దీనితో ప్రజలు చాల ఇబ్బందిపడిపోతున్నారు. ముందుకేమి కానుందోఅని భయపడి పోతున్నారు ప్రజలు.

వెంటనే యీ 11 గ్రామాలకుకూడా రేషనింగు అమలుజరిపి, అన్నిడిపోలలోను ప్రజలకు సరిపడేటంత బియ్యం సప్లయిచేసే ఏర్పాట్లు అధికారులుచేయాలి. ఈవిషయంలో ప్రజాసంస్థలు,ఆహారకమిటీలు పూర్తిగా సహకారం ఇవ్వడానికి సిద్ధంగాఉన్నాయి. వాటి సహకారంతో అధికారులు పరిస్థితులను సరిదిద్దాలి.

ఆహారకమిటీలు

జమ్మలమడుగు (కడపజిల్లా) తాలూకా ఆహారసమహాసభ గతనెల 17వ తేదీన జమ్మలమడుగులో జరిగింది. వివిధప్రాంతాలనుండి 40 మంది ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశంలో 17 మంది సభ్యులుగల తాలూకా ఆహారసంఘాన్ని ఏర్పాటుచేశారు. దీనికి శ్రీ టి. పుల్లారెడ్డిగారు బి. ఏ., బి. యల్. అధ్యక్షులు. శ్రీ యల్. ఆర్. సుబ్బారెడ్డిగారు కార్యదర్శి.

ఇదేవిధంగా వివిధపార్టీల, వర్గాల ప్రముఖులతోకూడిన ఆహారకమిటీలను గ్రామాల్లో స్థాపించాలనీ; తాలూకా ప్రజలకు అందుబాటులో ఉండేలా 5 మైళ్ళ కొకటిచొప్పున చౌకడిపోలు పెట్టాలనీ తీర్మానించారు.

తాలూకాలోని పెద్ద పసుపులు, మోరగుడి గ్రామాల్లో ఆహారకమిటీ లేర్పడ్డాయి.

కృష్ణాజిల్లా, నూజివీడు తాలూకా పోతురెడ్డిగారి పల్లెలో ఒకఆహారకమిటీ ఏర్పడింది.

పైరు వుంది. దీనికి 1200 బస్తాలు వేరుశెనగపిట్టు కావలసియుంది. కాని సప్లయి ఏమాత్రమూ చాలడంలేదు. ఇదిగాక కొత్తపట్నం వగైరా వాగర్తి ప్రాంతాలలో ఎరువు సప్లయిలేక, తమిదపైరును తగ్గించివేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం కంట్రోల్ ధరలకు వేరుశెనగపిట్టు, అమోనియా తగినంతగా సప్లయిచేయవలసిందని తాలూకారైతుసంఘ కార్యదర్శి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎరువుల కంట్రోలును ప్రవేశ పెట్టాలి.

రాబోవుసంవత్సరానికి ప్రభుత్వం కడపజిల్లాలో 2 లక్షల రూపాయల ఎరువులను కొని స్టాకుచేయవలసిందనీ, సక్రమమైన ధరలకు అమ్మేటట్లు ధరలకంట్రోలును ప్రవేశపెట్టవలసిందనీ, మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతూ కడపజిల్లా రైతుసంఘం గతనెల 23, 24 తేదీలలో సమావేశమై తీర్మానించింది.

కానూరు, పెండ్యాల ప్రాజెక్టులకై ఆందోళన

25-10-43వ తేదీని పశ్చిమగోదావరిజిల్లా, తణుకు తాలూకా కానూరులో కానూరు - పెండ్యాల ప్రాజెక్టు రైతుల సమావేశం జరిగింది. 17 గ్రామాలనుంచి 350 మంది ప్రతినిధులు యిందులో పాల్గొన్నారు. గోదావరినదిలో విఘ్నేశ్వరం లాకులప్రక్కనే తనేల్ కట్టి, కానూరు ప్రాజెక్టుకు కాలువను త్రవ్వించుటకై ప్రభుత్వం ప్లాను వేస్తూన్నందుకు సంతోషం వెలిబుచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంవల్ల 3,323 యకరములు సాగు అగుటకవకాశం ఉంది కాని, నిడదవోలు - నర్సాపురం రోడ్డుకు తూర్పుగా బ్రాంచి ఛానల్పు కూడా త్రవ్వించినట్లయితే, యీ దిగువ భూములను కూడా సాగుకు తీసుకురావచ్చునని సూచించబడింది: విఘ్నేశ్వరం : 50 యకరాలు; గోపవరం : 100 యకరాలు; పురుషోత్తంపల్లి : 100 యకరాలు; పందలపర్రు : 25 యకరాలు; ముప్పవరం : 50 యకరాలు; నిడదవోలు : 220 యకరాలు; కలవచర్ల : 250 యకరాలు; కోరుమిల్లి : 150 యకరాలు; నడపల్లె : 200 యకరాలు. కానూరు స్కీముతోపాటు పెండ్యాలస్కీమును కూడా అమలు జరుపవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడింది. (1937 లో యీ రెండు స్కీములను అమలు పరచుటకు మద్రాసు ప్రభుత్వం నిర్ణయించింది.)

బెంగాల్ ప్రజలరక్షణకై

కరాచీలో :

బెంగాల్ కరువునిధికోసం ప్రొఫెసర్ బి. జె. వాస్వాని అధ్యక్షతను వినోదప్రదర్శనాలు జరుగుతున్నాయి. ఒక అమెరికన్ సైనికోద్యోగి హటాత్తుగా లోపలికివచ్చాడు.

"పదవతేదీ ప్రదర్శనాల (ఆనాడు మిత్రమండలి సైనికులకోసం ప్రత్యేక ఏర్పాటు)కు నేనురాలేను. నా విరాళం ఇప్పుడే తీసుకోండి" అంటూ తన జేబులన్నీ ఖాళీచేశాడు — రూ 74-6-0 పోగయింది, వాటిల్లోంచి.

హాలులోవున్న భారతీయ ప్రేక్షకులు సంతోషం పట్టలేక, కరతాళధ్వనులతో అమెరికామిత్రుణ్ని అభినందించారు.

అతని ఆదర్శాన్నిచూచి అక్కడేవున్న ఒక భాటియా పెద్దమనిషి రూ 101-0-0 ఇచ్చాశాడు.

* * *

చినకళ్లేపల్లిలో :

"ఆకలిబాధ మాకు బాగాతెలుసు. ఇదివరకుప్రతిసంవత్సరమూ మాకుటుంబంఅంతా ఒక 'బెంగాలు' గానే ఉండేది. ఈనాడు కొంత నిలవకు నోచుకున్నాం-తీసుకువెళ్ళండిబాబు" అంటూ ఒక కుంచంధాన్యం యిచ్చాడు — చినకళ్లేపల్లి దగ్గరలోనే ఒకచోట. బీదకూలీ లోకం బ్రహ్మయ్య. నీశక్తి కిది మించింది అని కామ్రేడ్స్ అన్నమాటకు అతను చెప్పిన జవాబది.

ఆవేళ కూరగాయల అమ్మకంలో బ్రహ్మయ్యకు ఒక రూపాయిలాభం వచ్చింది. అందుకు కలిగిన సంతోషంతోపాటు అతనికి బెంగాలు సోదరులపట్ల బాధ్యత కూడా గుర్తుకొచ్చింది.

* * *

తెనాలిలో :

తెనాలితాలూకా రైతుసంఘయాజమాన్యాన తెనాలిలో 23-10-43 వ తేదీని బెంగాల్ కరువుబాధితుల సహాయార్థం జోగి సుబ్బారావు పార్టీవాడు "గయ్యాళిగంప" అను నాటకం ప్రదర్శించారు. దీనివల్ల రు. 1350 వసూలు అయింది. తాలూకా రైతుసంఘ కార్యదర్శి మధ్యలో విరాళాలకు విజ్ఞప్తి చేయగా, ప్రేక్షకులు రు. 284 యిచ్చారు.

బెంగాలు కరువును గురించి మొండిచేయి చూపిస్తూ ఎమెరీ రోతపుట్టించే ఉపన్యాసాలనెన్నయినా దంచవచ్చు. ప్రభుత్వ వర్గాలు ఒకరిపై నొకరు నిందలు కురిపించుకుంటూ కాలం గడపవచ్చు. కాని, ఈలోగా వేలాదిగ ప్రజలు మలమలమాడి చస్తున్నారు. ఇంకా వేలకొలది ప్రజల్లో గుండెనిబ్బరం అడుగంటుతూంది. ఫాసిస్టు ప్రతిఘటనకు దీనివల్ల కలిగే నష్టాన్ని చిత్తశుద్ధిగల సైనికుడు గుర్తిస్తున్నాడు. సోదర ప్రజల ప్రాణాలను కాపాడవలసిన అవసరాన్ని బీదలు, ధనికులు అంతా గుర్తిస్తున్నారు.

ఈ కరువు నివారణకు, దేశక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి ప్రజా సంస్థకు వీరు చేదోడుగా ఉంటారు. తమ తోడ్పాటుతో ఆసంస్థలకృషిని ఎన్నోరెట్లుగ అభివృద్ధి పరుస్తారు. ఇందుకు నిదర్శనం—

బొంబాయిలో :

పీపుల్సువారి ఆఫీసుకు ఒక కవరు వచ్చింది - విమానదళంలో ఉన్న ఒక భారత యువకుని దగ్గర్నుంచి. అందులో కమ్యూనిస్టు పార్టీ నిధికి 50 రూపాయిలకు చెక్కు, ఒక జాబు ఉన్నాయి.

"ఒక సైనికుడు అర్పిస్తున్న ఈ స్వల్పాన్ని స్వీకరించండి. ప్రేమతోను, పార్టీచేస్తున్న సేవపట్ల భక్తితోను ఇస్తూన్నది. దీనిని మీరు స్వీకరించడంతో మా మాతృదేశరక్షణ దీక్ష ఎన్నోరెట్లు పెరుగుతుంది."

* * *

గోగినేనివారిపాలెంలో :

కృష్ణాజిల్లా గోగినేనివారిపాలెంలో కమ్యూనిస్టులు, సానుభూతిపరులు బెంగాలునిధిని వసూలుచేశారు. ఆగ్రామపెద్ద, ధనికరైతు, 70 సంవత్సరాలవృద్ధు—ఘట్టమనేని రామయ్యగారు బెంగాలు పరిస్థితులనువిని పట్టలేక—తానూ నిధివసూలుకు బయలుదేరాడు. ఇది చూచి కొందరు ప్రజాద్రోహులు, ఈవసూళ్ళన్నిటినీ కమ్యూనిస్టులు కాజేస్తున్నారని అతనికి బోధింపబోయారు. "వాళ్లెప్పుడూ అలాచేయరు. పంపినదానికి రశీదులు చూపిస్తారు కూడా" అని అతడు వాళ్ళకు బుద్ధి చెప్పాడు.

ఆశ్చర్యాల భావమేమిటి?

సెప్టెంబరు 19 న బెంగాలు కరువు నివారణనిధికి ఆంధ్రదేశమంతటా ధనధాన్యాదులు వసూలు చేయవలసిందని ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ,రాష్ట్ర రైతు, విద్యార్థిసంఘాలు సందేశం ఇచ్చాయి. ఆంధ్రరాష్ట్రమంతటా ఆ దినం జయప్రదంగా సాగింది. కాని, కాకినాడలో అధికారులు అడ్డుతగిలారు. బెంగాల్ డే జరపడానికి వీల్లేదని తూర్పు గోదావరిజిల్లా మేజస్ట్రీటు ఉత్తరువు చేశాడు. సోదర రాష్ట్రప్రజలు ఆకలితో మాడిచస్తుంటే సాయంచేయ ప్రయత్నించడం ఈ అధికారికి నిషేధింప తగిన విషయం అయింది! మానవ సమాజంలో కనీసధర్మంగా పాటించవలసిన విషయం ఈ అధికారికి చట్టవిరుద్ధమయింది!

అంతటితో ఆగలేదతడు. కాకినాడ పట్టణ విద్యార్థి సంఘం అక్టోబరుమాసం 30, 31 తేదీలలో విద్యార్థి వైజ్ఞానిక మహాసభ జరుపుట నిశ్చయించింది. ఈమహాసభ ప్రధాన ఉద్దేశం విద్యార్థులలో శారీరక, వైజ్ఞానికాభివృద్ధి కలిగించడమే అని అందరూ గుర్తించినదే. నేటి పరిస్థితుల్లో ఈ మహాసభలద్వారా విద్యార్థి లోకాన్ని దేశరక్షణకు పురికొల్పుతూంది విద్యార్థి సంస్థ. కాని, తూర్పు గోదావరిజిల్లా మేజస్ట్రీటు మరో విధంగా దీనికి విలువ కట్టాడు. దేశరక్షణచట్టణం—56 వ నిబంధన ప్రకారం ఈ సభను జరపడానికి వీల్లేదని నిషేధించిపారేశాడు.

అంతకుముందు కాకినాడలో జరుపదలచిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభను, తూర్పు గోదావరిజిల్లా విద్యార్థి మహాసభను కూడా నిషేధించాడు.

ఈ జిల్లాకి పొరుగునే ఉన్న పశ్చిమ గోదావరిజిల్లాలో విద్యార్థిసంఘ కార్యక్రమాలన్నిటినీ నిషేధించాడు, అక్కడి జిల్లా మేజస్ట్రీటు.

ఈనిషేధాల అంతరార్థమేమిటి? దేశరక్షణకు, ఫాసిస్టు ప్రతికూలతకు — దేశదుస్థితిని తొలగించడానికి, విద్యార్థులనందరిని సంఘటితపరచడంకోసం విద్యార్థిసంఘాలు దేశమంతటా ఏకసూత్రంమీద కార్యక్రమం కొనసాగిస్తున్నాయి; కేంద్రప్రభుత్వంగాని, రాష్ట్రప్రభుత్వాలుగాని, ఈకార్యక్రమం నిషేధింప తగినవని ఎక్కడా ఎంచలేదు. అలాంటిది ఈరెండు జిల్లా అధికారులుమాత్రమే ఈ వైఖరి అవలంబించడంలో అర్థంఏమయినా ఉందా? విద్యార్థుల వైజ్ఞానికాభివృద్ధిని అరికట్టి, సోదరప్రజలకు చేయదలచిన సహాయానికి అడ్డుతగిలి, వీరు సాధించదలచిన దేశరక్షణ ఏమిటి?

రైతుసభపై నిషేధం

తూర్పుగోదావరి జిల్లాలోనే, పిఠాపురం తాలూకా రైతుమహాసభను గతనెల 16, 17 తేదీలలో గొల్లప్రోలులో జరుపబోతే, రైతు సభనుగురించి పదిమందికలసి మాట్లాడకూడదని పిఠాపురం సబిన్‌స్పెక్టర్ టముకువేయించాడు. 16 వతేదీరాత్రి సర్కిల్ ఇన్‌స్పెక్టరు సిబ్బందితో తయారయాడు, మహాసభ జరక్కుండాచేయడానికి. ఆహారాన్ని అధికంగా పండించి, దేశంలోని కరువు సమస్యను పరిష్కరించేమార్గం ఆలోచించడమే ఈ మహాసభ ఉద్దేశం—దీనివల్ల దేశరక్షణ బలపడుతుందిగాని, కుంటుపడదని ఆ పోలీసు అధికారులకు ఎంతచెప్పినా బుర్రకెక్కలేదు. జిల్లామొత్తంమీద మీటింగులు జరుపుకోవచ్చునని జిల్లామేజస్ట్రేటు లోగడచేసిన ఉత్తరువుచూపించినా ప్రయోజనం లేకపోయింది.

★ బాలబాలికలకు ★

"సోవియటు బాలబాలికలు" అనే పుస్తకం మీరు చదివారు. వాళ్ళనుగురించి చాలావిషయాలు తెలుసుకున్నారు. అయినా, ఇంకా తెలిసికోదగిన విషయాలు చాలా ఉన్నాయి. వాళ్ళకుండే స్వాతంత్ర్యాన్ని గురించి ఒకకథ చెబుతాను. ఇది సోవియటు స్కూలు పిల్లల గోడవార్తాపత్రికలో ప్రకటించారు. అదే మీకు చెబుతున్నాను.

'కోస్త్యా' అనే బాలుడున్నాడు. పదేళ్ళవయస్సు. అతని తండ్రి బహు కోపదారి. అందుకుతోడు, ఈబాలుడు కాస్త అల్లరిపిల్లవాడు. తండ్రికి జబ్బుగావుంది. జబ్బుమనుష్యులకి బక్కకోపంజాస్తి. అందుచే ఆకోపదారితండ్రికి ఈకుర్రాడి అల్లరి భరింప వీలులేకుండా వుండేది.

ఒకరోజున కొడుకును తండ్రి కొట్టాడు. 'కోస్త్యా' తనతోడి పిల్లలతో ఈవిషయంచెప్పి, వారిని వెంటబెట్టుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్ళాడు. తండ్రిపై ఫిర్యాదుచేశాడు.

మరునాడు పోలీసుఉద్యోగి 'కోస్త్యా' తండ్రిని కలిసికొన్నాడు. విచారణ చేయడానికి వచ్చాననిచెప్పాడు. కొడుకు ఫిర్యాదుచేశాడన్న సంగతివిని తండ్రి ఆశ్చర్యపడ్డాడు: 'కోస్త్యా' తండ్రి పెద్దమనిషి అవడంవల్ల పోలీసుఉద్యోగికీ ఆశ్చర్యం వేసింది. మర్యాదస్థులెవరూ పిల్లల్ని కొట్టరుగామరి? 'కోస్త్యా' తండ్రి ఇలా అన్నాడు: 'నాకు పిల్లవాణ్ణికొట్టే అలవాటులేదు. తొలిరోజున నాకు తలనొప్పిగా వుంది. 'కోస్త్యా' అల్లరిచేశాడు. బయటికిపోయి ఆడుకోమని బ్రతిమాలినా, వినలేదు. కోపం ఆపుకోలేక లెంపకాయకొట్టాను. ఇదే వాడు మొదటిసారి దెబ్బతినడం. అందుచేతనే ఇంతఉక్రోషం వచ్చింది. వాడిఫిర్యాదు న్యాయమయిందే.'

"అలా మళ్ళాకొట్టరని ఆశించుతాను. ఇంకోనెలకు నాడ్యూటీ ప్రకారం మళ్లీ వచ్చి విచారించుతాను." అంటూ ఉద్యోగివెళ్ళాడు. వెళుతూ వెళుతూ 'కోస్త్యా'ని పిలిచి, "దెబ్బలుతినడం ఇదేనా మొదటిసారి?" అనిఅడిగాడు. కుర్రాడు అవునన్నాడు. కాని, 'కోస్త్యా' నిలవేసి ఒకప్రశ్న అడిగాడు. "సోవియటు న్యాయశాస్త్రం ప్రకారం తలిదండ్రులు పిల్లల్ని కొట్టగూడదు. చేయిచేసుకోనేగూడదు. అందుట్లో మానాన్న న్యాయవాది. అంతమాత్రం అతనికి తెలియదా?" అని సవాలుచేశాడు.

చూశారా! రష్యాలో పిల్లలకు ఎంత స్వాతంత్ర్యముందో? మనదేశంలో కూడా అలావుంటే బాగుండదూ? ఆలా పిల్లలనుగురించి శ్రద్ధతీసుకొనే నాగరికతను ఏర్పరచిన ప్రభుత్వాన్ని ఇక్కడకూడా స్థాపించుకొందామా? అలాకావాలనుకొంటే, బాలసంఘాలలోచేరి, ఆదేశానికి సంబంధించిన బాలబాలికలను గురించి తెలిసికోండి.

— దొడ్డమ్మ.

85 గ్రామాల్లో 3698 సభ్యత్వం

జిల్లా మహిళా ప్రచారక కమిటీ కృషి ఫలితంగా, గుంటూరుజిల్లాలో మహిళా ఉద్యమం రోజురోజుకూ పెంపొందుతూవుంది. అక్టోబరు 1 నాటికి 85 గ్రామాలలో 3698 సభ్యత్వం కల్గియుంది. 38 స్థానిక సంఘాలున్నాయి.

గ్రామాలలో స్త్రీలకు ఉన్న ఇబ్బందులలో ముఖ్యమైనది పాకీదొడ్లకొరత. మహిళాప్రచారక కమిటీ ఆందోళన ఫలితంగా, అమృతలూరులో 3 చోట్ల రేపల్లెలో 7 చోట్ల దొడ్లు కట్టించారు. క్రాపలో 4 చోట్ల కట్టించడానికి శాంక్షనయింది. ఇంకా అనేకచోట్ల వీటికోసం ప్రయత్నం జరుగుతూంది.

అచ్చమ్మ-బుచ్చమ్మ కబుర్లతో కాలక్షేపం చేయకుండా, లోకజ్ఞానం పెంపొందడానికి కొన్నిచోట్ల పఠనకేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇప్పటికి 17 గ్రామాలలో 24 పఠనకేంద్రాలు ఏర్పడ్డాయి. మరికొన్నిచోట్ల చదువురాని వారికి చదువుకూడ నేర్పుతున్నారు.

స్త్రీ వలంటీర్లు పాతగుంటూరులో చౌకడిపోలవద్ద ప్రజలకు బాగా సహాయపడుతున్నారు. స్త్రీలనుసర్ది కూర్చోపెట్టి, ఇబ్బంది లేకుండా చేస్తున్నారు.

ఈవిధంగా జిల్లా మహిళాకమిటీ స్థానిక సమస్యలను తీసుకొని కృషిచేస్తూ వృద్ధి చెందుతోంది.

* * *

2-10-43 న జిల్లాకలెక్టరువద్దకు మహిళా ప్రచారకమిటీ సభ్యులు 16 గురితో ఒక రాయబారంవెళ్ళి ఈక్రిందికోర్కెలను తెలియజేశారు.

1. హిందూ 'లా' సవరణబిల్లును కృష్ణాజిల్లా మహిళాసంఘం సూచించిన సవరణలతో వెంటనే శాసనసభలో ప్యాసు చేసి అమలులోకి తీసుకురావాలి.
2. ప్రతితాలూకా సెంటరుకు ఒక్కొక్క ప్రసూతి వైద్యశాలను ఏర్పరచాలి.
3. ఫిర్కాలకు స్త్రీ డాక్టరును నియమించాలి; ఆఫీసర్లు గ్రామాలకు కనీసము వారానికొకసారి తనిఖీలకువెళ్ళాలి.
4. ప్రతిగ్రామానికి ఒక్కొక్క తర్ఫీదు పొందిన మంత్రసానిని నియమించాలి.
5. ప్రతి గ్రామానికి పాయిఖానాదొడ్లు కట్టించుటకు పంచాయితీవారికి ప్రభుత్వం అర్థప్లుపంపాలి.
6. గుంటూరు టౌనులో మ్యునిసిపాలిటీవారు తీర్మానించినవిధంగా స్త్రీల కళాశాలనొకదానిని వెంటనే స్థాపించేలా చేయాలి.
7. అధికోత్పత్తి, ఆహారపొదుపు, ఆరోగ్యము, శిశుపోషణ, ప్రసవాది విషయములపై చార్టులనుమ్యాపులను రకమునకొక్కొక్కటి చొప్పున తాలూకా ఆఫీసులకు, జిల్లా ప్రచారకకమిటీ ఆఫీసుకు సప్లయి చేయాలి.
8. గుంటూరుటౌనులో స్త్రీలకు ప్రత్యేక చౌకడిపో పెట్టించాలని కోరారు.

ఆరోగ్యానికి సంబంధించిన కోర్కెలను సర్జన్ జనరలుగారికి, హక్కుల విషయమై అధికారవర్గమువారికి (Provincial Government). తెలియజేస్తామని కలెక్టరు తెలియజేశారు. పాకీదొడ్ల విషయమై యిటువంటి కోర్కెలు స్త్రీలకు చాల వుపయోగకరమని ప్రశంసించారు. పైకోర్కెలన్నీ మెమొరాండంగా తయారుచేసి పంపమన్నారు.

స్వామీజీ సంచారం వాయిదాపడింది

★

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ నండూరి ప్రసాదరావుగారు ఈ క్రిందిప్రకటన గావిస్తున్నారు :—

అఖిలభారత రైతుసంఘ ప్రధానకార్యదర్శి శ్రీస్వామిసహజానందసరస్వతిగారు నవంబరు 7 వ తేదీనుండి 15 రోజులు ఆంధ్రదేశంలో సంచారంచేయుటకు లోగడ అంగీకరించినారు. కాని బీహారులో బెల్లపు కంట్రోలు ఆర్డరువల్ల ఏర్పడ్డ చిక్కుల మూలకంగా ప్రస్తుతం నవంబరులో వచ్చుటకు వీలుపడదని స్వామిజీ టెలిగ్రాంద్వారా తెలియపర్చినారు. ఎప్పుడు సంచారరి చేయునదీ ముందు ప్రకటింపబడును.

మహిళాసంఘంఅంటే మంట

గతనెల 8 వ తేదీని నర్సారావుపేట తాలూకా రొంపిచర్ల గ్రామంలో తాలూకా మహిళాసంఘ ఆర్గనైజరు యం,పార్వతిగారు, స్థానిక బాలసంఘ సభ్యులుకలసి వైజ్ఞానిక ప్రచారం జరుపుతున్నారు. ఆసందర్భంలో పార్వతిగారు మహిళాసంఘం గురించి మాట్లాడబోయింది. ప్రేక్షకుడుగా వచ్చిన గ్రామమునసబు,తనగ్రామంలోమహిళాసంఘం గురించి మాట్లాడకూడదంటూ అరిచాడు. ఎంతచెప్పినా లాభంలేకపోయింది.

ఈ విధంగా పైనుంచి కిందవరకూ అధికారులు సంకుచితదృష్టితో ప్రవర్తిస్తూ సర్వతోముఖ ప్రజాసంఘటనకు, దేశరక్షణ కార్యనిర్వహణకు, అడ్డుతగలడం క్షంతవ్యంకాదు. వీరి ప్రవర్తన పేనుకు పెత్తనం ఇచ్చినట్లుంది. అదృష్టవశాత్తు ఇలాంటివారు అక్కడక్కడ మాత్రమే ఉన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల ఐకమత్యమే వీరి ఆటలను అంతమొందించగలదు.

ఒంగోలులో గద్దెలగుంటలో మహిళా సంఘ ప్రచారసందర్భంలో మోటూరి ఉదయంగారు ఆహారసమస్యనుగురించి వివరించారు. అందులో కోళ్ళపెంపకం, మంచికూరగాయల పెంపకం, మొదలగువాటిని గురించి చెప్పారు. ఇదంతావినిన కొందరు స్త్రీలు "ఏమండీ మేమంతా డబ్బు వసూలుచేసిఇస్తాం. మాకు రోజూగుడ్లు పెట్టే కోళ్లనుతెప్పిస్తారా?" అంటూ ఉత్సాహంగా అడిగారు. వెంటనే కొన్నిచోట్ల కోళ్ళపెంపకానికి, మరికొన్నిచోట్ల కూరగాయల పెంపకానికి, ప్లానులువేశారు. 2 చోట్ల పఠనకేంద్రాలు పెట్టారు.

అన్నివిధాల అధికోత్పత్తి జరపడమే కార్మికుల ఆశయం

అధికారులు కూడా ఇందుకు కలసివస్తే....

యుద్ధానికి పూర్వంగూడూరు లోమైకా గనులనుండి 20 లక్షల రూపాయల విలువ గల మైకా వచ్చేది. ఇప్పుడు 40 నుంచి 50 లక్షల విలువగల మైకా తయారుగుచున్నది. యుద్ధఅవసరాలకు యీరోజున మైకా ఎంతైన ఉపయోగపడుతుంది. మైకా గనులు కొత్తవి ఎన్నో కనిపెట్టబడ్డాయి. కాని, పని వారల సంఖ్య యీరోజున సరిపోవడంలేదు. కారణం పనివారలకు సరియగు సౌకర్యాలు కలుగ చేయకపోవడమే. గూడూరు డివిజను మైకా పనివారల సంఘము ఉత్పత్తిని వృద్ధి చేయడానికి, కార్మికుల హక్కులు నిలబెట్ట డానికి, కృషిచేస్తుంది. యూనియను తరఫున కామ్రేడ్స్ సి. వి. కె. రావు, సి. సి. సుబ్బయ్య, భరద్వాజులు ఇండియా ప్రభుత్వం నియమించిన మైకా ఇంజనీరుని గూడూరులో కలుసుకొని, ఉత్పత్తికి ఇప్పుడు కలుగుతున్న అడ్డంకులనుగురించి చర్చించారు. కార్మికులకు సరియగు సదుపాయాలు కలిగించక యజమానులు నిర్లక్ష్యంచేశారు. ప్రభుత్వం తగిన చర్య తీసుకోలేదు. మైకా గనులు, మైకా ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు దాదాపు 50 వేలకు పైగా వున్నారు. వారికి బియ్యం చౌక ధరకు దొరకుట లేదు. కిరసనాయిల్ సప్లయిలేదు. 5 వేల జనాభా గల ఒక పట్టణానికి 4 కిరసనాయిలు డబ్బాలు మాత్రమే ఒకచోట సప్లయి అవుతుంది. మైకా కూలీలు అనేక యిబ్బందులకు గురి అవుతున్నారు. 27–10–43 తేదీని మైకాపనివారల సంఘం యొక్క కార్యనిర్వాహకవర్గం గూడూరులో సమావేశమైంది. కామ్రేడ్ సి. వి. కె. రావు కార్మికులు తమ సంఘములో నూటికి నూరు మందిని చేర్చి బలమైన సంఘముగా ఏర్పచ్చ కోవాలని ఉద్బోధించారు. దేశరక్షణకు రాను ఉత్పత్తి విధానాన్ని అమలులో పెట్టాలని చెప్పారు. కార్మికులకు యీరోజున కరువు భత్యంలేదు. సరకుల ధరలువిపరీతముగా పెరిగి పోయాయి. కార్మికులకు అధికధరలవేతనము, బోనసు, చౌక అంగళ్ళు, చౌకబట్ట, మొదలగు సౌకర్యాలనుగురించి యిండియా ప్రభుత్వానికి, మదరాసు గవర్నమెంటుకు ఒక మెమొరాండము పంపాలని తీర్మానించడమైంది. మైకా ఉత్పత్తి విధానము గురించి డిసెంబరు నెలలో ఉత్పత్తి సమావేశం జరుపుటకు తీర్మానించడమైంది.

చుండూరు వెంకటరెడ్డి కొత్త ఎత్తుగడలు_ఉత్పత్తికి అపరిమిత నష్టము

దాదాపు మూడునెలలనుంచి కార్మికులను చుండూరు వెంకటరెడ్డిగారు తిండిలేకుండా మాడ్చుచున్నారు. కాని కార్మికులు లొంగడం లేదు. కార్మికులను సమ్మెకు రెచ్చగొట్టినా, కార్మికులు సమ్మెచేయలేదు. 20 వేల ప్రజల సానుభూతితో కార్మికులు, ప్రజల అవసరాలకు నష్టం రాకుండా, ఉత్పత్తిని కాపాడగలిగారు. చుండూరు రెడ్డికి లాభములు తప్ప మిగతావి అనవసరంలేదు. కార్మికులను లొంగదియ్యాలి. వారి సంఘము నాశనం చెయ్యాలి. తన కక్ష నెరవేరాలి– యివి రెడ్డిగారి నినాదాలు. పని లేదని తన ప్లీడరుద్వారా వాదించే రెడ్డిగారు, యీరోజున దొంగకూలీలచే పని చేయించుకొంటున్నారు. సంఘంనుండి కార్మికులను చీల్చి పనిలో పెట్టుకోడానికి తమఏజంట్ల ద్వారా పనిచేస్తున్నారు. పని చేతగాని దొంగ కూలీలను పనిలో పెట్టడంద్వారా ఉత్పత్తిని తగ్గుతున్నారు. కూలీలను సంఘం నుంచి చీల్చడంద్వారా కూలీలలో ద్వేషం పురికొల్పుతున్నారు. ఇవి దేశక్షేమానికి, ప్రజల క్షేమానికి విరుద్ధమైన కార్యములు. మదరాసు రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధులు యీ మధ్య ప్రభుత్వ ఎడ్వైజరు స్త్రాతీ గారిని కలుసుకొని ఫౌండరీ కార్మికుల తగాదాను త్వరగాపరిష్కరించమని విజ్ఞప్తి చేశారు

కార్మిక వారము

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ రాష్ట్రములోని అన్ని కార్మికసంఘాలు నవంబరు 7 నుంచి 13 వరకు కార్మికవారము జరుపవలెనని హెచ్చరించుచున్నది. కార్మికులలో తీవ్రమైన సంఘచైతన్యం కల్గచెయ్యాలి నూటికి నూరుమందిని సంఘంలో సభ్యులుగా చేర్పించాలి. కార్మికులు తమ దేశభక్తియుతమైన ఉత్పత్తివిధానాన్ని అమలులో పెట్టాలి. కార్మికుల హక్కులు, జీవిత సౌకర్యాలు, సంఘముద్వారా సమీకరణ అయిననాడే సాధ్యమవుతాయి. ఈ దిగువ తారీఖులలో కార్మిక వారము జరపాలి.

7–11–43	రష్యా విప్లవదినము
8–11–43	రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ తీర్మానాలు, అ॥ భా॥ ట్రే॥ కాంగ్రెసు తీర్మానాలు
9–11–43	కార్మికనాయకుల విడుదల దినం
10–11–43	అధికోత్పత్తి దినం
11–11–43	కరువుభత్యము దినము
12–11–43	జాతీయనాయకుల విడుదలదినం జాతీయప్రభుత్వ దినం
13–11–43	కార్మికుల ర్యాలి

మునుపు 8 గంటలపని ఇప్పుడు 4 గంటల్లో

ఈ కరువు రోజుల్లో దేశంలోని ఆయా ప్రాంతాలకు కావలసిన ఆహారాన్ని ఇతర చోట్లనుండి అందించడానికి రైల్వేలు ముఖ్య ఆధారం. ఈ రంగంలో కార్మికులు నూతన చైతన్యంతో అధికకృషి చేస్తున్నారు.

బెంగాల్ - అస్సాం రైల్వేలో డిబ్రుగర్ అనే కేంద్రంలో రైల్వే కార్మికులు సాధారణంగా ఎనిమిది గంటలు (ఒకరోజు) వస్తే పనిని 4 గంటల్లో పూర్తిచేశారు. అంతేకాదు. వీరు మరోఅడుగుముందుకుపోయారు. ఆకలి, మంటలతో మాడిపోతున్న బెంగాల్ సోదరులకు తిండి పెట్టడానికి ఈ రైల్వే కార్మిక సంఘం నిశ్చయించుకొంది. సంఘాధ్యక్షుడు కామ్రేడ్ బాయిజినాద్‌ప్రసాద్ 700 మందికి ఒకరోజు ఆహారం విరాళంగా ఇచ్చాడు. మరి కొంతమంది తమ జేబులను ఖాళీచేసి 300 మందికి తిండిపెట్టారు.

జీతం లేకపోయినాసరే

కొలంబో (లంక) లో హారిజన్ అండ్ క్రాస్‌ఫీల్డు రబ్బరు ప్యాకింగు కంపెనీ ఒకటుంది. ఈకంపెనీకి రష్యానుంచి ఒకఆర్డరు వచ్చింది. ఈఆర్డరుప్రకారం రష్యాకు రబ్బరు ప్యాక్‌చేస్తూండగా అధికారులు ఒకకార్మికుణ్ణి పనిలోనుంచి తొలగించబోయారు. అతనక్కడనుంచి కదలనన్నాడు. “సోవియట్ యూనియన్‌నుంచి నాజీపిశాచాలను రెడార్మీ తరిమిగొడుతూంటే – నేను యీపనిని విడిచిపెట్టి పూరోగలనా ? జీతం లేకుండాఅయినా పని చేస్తానుగాని, యిక్కణ్ణించి వెళ్ళను,” అని తన పనిలో మునిగిపోయాడు. అధికారులు పోలీసులను కూడా పిలిపించారు. లాభంలేకపోయింది. చివరికతనికార్యదీక్ష జయించింది.

యుద్ధానంతరం గ్రీసులో ఎట్టి ప్రభుత్వం ఉండాలి?

గ్రీకు ప్రజల సమాధానం

ఇటలీ జర్మనీలు గ్రీసును ఆక్రమించుకొన్నతర్వాత, ఆదేశపు రాజూ–ప్రభుత్వమూ లండన్‌లో తలదాచుకొంటూవచ్చారు. ఇపుడు కైరోలో నివాసం పెట్టారు.

ఫాసిస్టులు గ్రీసులో కాలుబెట్టినవాదిగా, ప్రజ లందరి తోడ్పాటులో గెరిల్లా సేనలు పోరాడుతూ వున్నాయి. గ్రీసులోని రాజకీయ పక్షా లన్నీ ఐక్యమై, స్వాతంత్ర్య సంయుక్త సంఘటనను యేర్పరచారు. అన్నిపక్షాలతో గూడిన ఈ సంయుక్తసంఘటనయే గెరిల్లాల వెనుక అండగా నిలబడి వుంది.

సంయుక్త సంఘటన ఆశయాలు

ఈవివిధపక్షాల కూటమియొక్క ఆశయం యేమిటి? ఫాసిజాన్ని, దాని ఏజంట్లనూ, ఊపిరి ఆడనీయకుండా వారిలో నిరంతరం పోరాటం సాగించటం. ఇంతేగాక గ్రీకుప్రభుత్వాన్ని ఆపక్షాలన్నీ ఒక కోర్కె కోరాయి. ఏమని? గ్రీకుప్రభుత్వంలోను, సైన్యంలోను, వున్న ఫాసిస్టులను, ఫాసిస్టు అనుకూలురను తక్షణం తొలగించాలని.

పైన చెప్పిన వివిధపక్షాల సంయుక్తసంఘటన ప్రస్తుత గ్రీకు రాజు జార్జిప్రభువును వ్యతిరేకిస్తున్నాయి. జార్జిప్రభువు, మెటాక్సస్‌కు ప్రభుత్వాన్ని అప్పగించిన సంగతి గ్రీకు ప్రజలు మరచిపోలేరు. మెటాక్సస్ ప్రజాస్వామ్య హక్కు లన్నీ నాశనంచేసి, నియంతృత్వాన్ని స్థాపించి, నాజీ దండయాత్ర సులభమయ్యేలా చేశాడు.

తాత్కాలిక మిశ్రమ మంత్రివర్గం

గ్రీసు భావిపరిపాలన ఎలా ఉండాలి అనే దానిని నిశ్చయించడానికి ప్రజా నిర్ణయం (ప్లెబిసైట్) జరిగేదాకా, జార్జి ప్రభువుగాని, రాజవంశీకులుగాని, గ్రీసులో అడుగు పెట్టవద్దంటూ, పైన చెప్పిన వివిధపక్షాల కూటమి కోరింది. ఆ ప్లెబిసైటు, బ్రిటన్- అమెరికా-రష్యాల సంయుక్త పరిశీలన క్రింద జరగాలనికూడా కోరింది. ప్లెబిసైట్ జరిగేదాకా, మిశ్రమ మంత్రివర్గం ఏర్పరచాలి. ఈ మంత్రివర్గంలో ప్రస్తుతం కైరోలోనున్న ప్రభుత్వం, రాజవంశంతరపున ‘ఒకపార్టీ’గా మాత్రమే చేరాలి. సైనిక, అంతరంగిక (ఇంటీరియర్) శాఖల మంత్రులు సంయుక్త సంఘటనకు చెందినవారే అయి వుండాలి.

ఈపైకోర్కెలను తెలియజేయడానికి కొంత కాలంక్రితం గ్రీకు గెరిల్లా సైనిక నాయకులు రాజువద్దకు రాయబారం వెళ్ళారు. కాని ఈ రాయబారం ఫలించలేదు. రాజు ఆ కోర్కెలను తిరస్కరించాడు.

జార్జి ప్రభువు ఈ కోర్కెల నంగీకరించడంకంటె దేశాన్ని అంతర్యుద్ధంలో ముంచడమే మంచిదనుకొన్నాడు. తన నిరంకుశ ప్రభుత్వం తిరిగి స్థాపించాలని అతని ఆశ. అందుచే ఆకోర్కెలను తిరస్కరించాడు.

కాని, గ్రీసులో అంతర్యుద్ధం రాకుండా, ప్రజలే జయం పొందుతారనడానికి నిదర్శనంగా గ్రీసు ప్రజల ఫాసిస్టు ప్రతిఘటనా ఉద్యమం నానాటికి వృద్ధిపొందుతోంది.

గ్రీకు సైన్యానికి, ప్రజలకూ ఆధునిక ఆయుధ పరికరాలు లేకపోయినా, ముస్సోలినీ సైన్యాలను ముప్పతిప్పలు పెట్టిన సంగతి అందరికీ తెలిసిందే. చివరకు ముస్సోలినీ హిట్లరు సహాయంతో గాని గ్రీసును జయించలేక పోయాడు.

గ్రీకు యోధులు పోరాటం మానలేదు. పర్వత ప్రాంతాలకు తప్పుకొని. గెరిల్లాలై నాజీలను ఎదిరింటుతూనేవున్నారు. ఈ గెరిల్లాల ఉద్యమం పూర్తిగా 5 జిల్లాలకుప్రాకింది. అవి: (1) త్రేస్, (2) బల్గేరియా సరిహద్దులలో నున్న రొడోప్ పర్వత పంక్తులు, (3) థెర్మోపైలీ (ఇది చరిత్రాత్మక ప్రదేశం: ఇచటి ప్రాచీన వీరులు పద్య కావ్యాలలో కెక్కి చిరంజీవులైనారు), (4) పార్నెస్ (5) స్పార్టా.

మిత్రరాజ్యాలు తిరోగమించి నపుడు ఇక్కడ వుండిపోయిన వేలకొలది ఆస్ట్రేలియన్ సైనికులు, న్యూజీలెండు సైనికులు కూడా గెరిల్లాలలోచేరారు. దక్షిణ గ్రీసులో 30 వేల మంది, క్రీట్‌లో 12 వేలమంది, గెరిల్లాలున్నారు.

పట్టణాలలో తిరుగుబాటు

యావన్మంది ప్రజలుకూడా తిరుగుబాటుకు తోడ్పడుతున్నారు. పట్టణాలలోను, నగరాలలోను, రెడ్‌ఆర్మీ విజయాలతో ఉత్సాహం పొందిన కార్మికవర్గ నాయకత్వాన ప్రజలు తిరుగుబాట్లు చేస్తున్నారు.

నాజీలు గ్రీసులోని తిండినంతా దోపిడి చేశారు. ప్రజలు ఆకూ అలం తింటూ ఉండవలసివచ్చింది. ఏథెన్సు (ముఖ్యపట్టణం)లో తిండిలేక వేలకొలది ప్రజలు మాడిపోయారు. గ్రీకు కార్మికులను జర్మనీలో పనిచేయించడానికి నాజీలు తీసుకుపోతున్నారని తెలియగానే, ఏథెన్సులో కార్మికులంతా ఫ్యాక్టరీలు వదలి,నడిబజార్లలోకి ఊరేగింపుతో వచ్చారు, యూనివర్సిటీ విద్యార్థులు, ప్రజలూ వారితో కలిశారు.

బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. నాజీలుపెట్టే హింసాకాండను ధిక్కరించుతూ ఊరేగింపు సాగింది. “నిర్బంధపు కూలి చేయరాదు!”, “జర్మనీ నశించాలి”, “ఇటలీ నశించాలి”, అంటూ ఊరేగింపులో నినాదాలిచ్చారు. సాయుధులైన ఫాసిస్టులను ప్రజలు సాయుధులయి అత్యంత సాహసంతో యెదుర్కొన్నారు. ఇట్టి వీరోచిత గ్రీకు ప్రజాప్రతిఘటన, భవిష్యత్తులో గ్రీసుదేశానికి మంచి దినాలు రానున్నాయని తెలియజేస్తోంది.

★ యుద్ధ సమీక్ష

జర్మను ప్రజలలో అపజయభీతి వ్యాపించుతోంది

●

నీపర్ రక్షణశ్రేణి ఛిన్నాభిన్నమయింది. నీపరు మలుపులోని జర్మను సైన్యాలగతి చావుబ్రదుకుల మధ్య తేలియాడుతోంది. క్రైమియా ఫాసిస్టు రాక్షసులకు మృత్యుగహ్వరంకానున్నది. యుక్రైన్ విముక్తి తుది ఘట్టంలోకి వచ్చింది. నాజీ రాజ్యాంగయంత్రమే ఇసుక గోడలలా కూలిపో సిద్ధంగా నుంది. ఇదీ ఈవారం మనకు కన్పడుతున్న దృశ్యం.

నీపర్ పెట్రోవ్‌స్క్, నీప్రొపెట్రొవ్‌స్క్ పట్టణాలు రెడ్ ఆర్మీ వశమయ్యాయి. ఇవి నీపర్ మలుపులో జర్మన్లకు వేదికగా ఉపయోగించుతూ వచ్చాయి. చాలముఖ్యమైన పారిశ్రామిక పట్టణాలుకూడ.

బోనులో పడ్డ ఎలుకలు

ముఖ్య రైల్వేకూడలిఅయి, ఇనుప పరిశ్రమలకు ప్రసిద్ధిచెందిన క్రివాయ్‌రాగ్‌ను రెడ్ ఆర్మీ క్రమ్ముకొంది. ఇక్కడ నాజీలు ప్రచండంగా తిరుగుదాడులు చేస్తున్నా రెడ్ ఆర్మీ తిప్పికొట్టివేస్తోంది. మెలిటోపోల్‌కు-అజావ్ సముద్రానికి మధ్యగా 5 దినాలక్రితం ఒక కొత్త దండయాత్రను సోవియట్ ప్రారంభించింది. ఈ దండయాత్ర జయప్రదంగా ముందుకు సాగుతోంది. మెలిటోపోల్ నుండి ఒక సోవియటుపంక్తి క్రైమియా నెత్తిన (తూర్పుభాగంలో)ఉన్న గెనిచాన్స్క్‌ను వశపరచుకొంది. క్రైమియానుండి నాజీ సేనలు తప్పుకోడానికి మార్గం పెరికోప్ భూసంధియే. ఈ పెరికోప్ భూసంధికి 15 మైళ్ళలోకి సోవియటుసైన్యాలు వచ్చాయి. పెరికోప్ వశమయిందంటే, జర్మన్లగతి బోనులోపడ్డ ఎలుకలగతి అవుతుంది.

ఒకవేళ నల్లసముద్రంగుండా తప్పించుకోవాలని జర్మను సైన్యాలు చూచినా, సోవియటు నౌకా విమాన దళాలు వాటిపని పట్టగలవు. లేదా, రెడ్ ఆర్మీ పెరికోప్‌కు రాకముందే పారిపోదామనుకొన్నా, నీపర్ నది దిగువ భాగంలో ఖెర్సన్ అనే రైలుమార్గం గుండా పోవాలి. కాని దాన్ని కూడా రెడ్ ఆర్మీ సమీపించుతోంది. నీపర్‌నది దిగువ భాగంలో ముఖ్యమైన రేవు పట్టణాలు: నికోపాల్, బెరిస్లావ్, ఖెర్సన్. నికోపాల్‌కు రెండు ప్రక్కలా రెడ్ ఆర్మీ క్రమ్ముకొని వస్తూంది. మెలిటోపాల్ నుండి వచ్చిన సోవియటు సైన్యాలు నికోపాల్, బెరిస్లావ్‌ల మధ్యనున్న జర్మను సైన్యాలను నీపర్‌నది ఒడ్డుకు నెట్టాయి. బెరిస్లావుకు 12 మైళ్ళలోకి రెడ్ ఆర్మీ వచ్చింది. ఇంతేకాదు, నికోపాల్–బెరిస్లావుల మధ్యలోని జర్మను సైన్యాలను రెండుగా చీల్చివేశాయి. ఖెర్సన్‌ను కూడ సమీపించుతున్నాయి.

ముందు నుయ్యి–వెనుక గొయ్యి

ఇలా నీపర్ మలుపులోని జర్మను సేనలకు కల్గిన ప్రమాదమేగాకుండా, క్రైమియాలో జర్మన్ల స్థితి ముందుగొయ్యి వెనుక నుయ్యిలా వుంది. క్రైమియాలో నిలచి పోరాడితే, బోనులోపడ్డ ఎలుకలు చిందులు తొక్కినట్లే. విడచి పారిపోతే, 8 నెలలు అతి భయంకరంగా పోరాడి వశంచేసుకున్న సెవాస్తపోల్ వంటి రేవుపట్టణం సోవియట్‌కు అప్పగించాలి. సెవాస్తపోల్ రెడ్ ఆర్మీకి చిక్కడమంటే నల్లసముద్రంలో నిరాఘాటంగా సోవియట్ నౌకలు తిరగడ మన్నమాట. బాల్కను దేశాలమీద సోవియట్ దండయాత్ర సులభమవడం అన్నమాట.

జర్మన్లు ప్రగల్భాలుకొట్టుకొనే "యూరప్ కోట"కు అన్నివైపులా దెబ్బలు తగులుతున్నాయి. లోపలినుండి, వెలుపలనుండి, గట్టి దెబ్బలు తగులుతున్నాయి. ఇటలీలో ఆంగ్లో–అమెరికన్ సైన్యాలు రోమ్‌వైపుకు పురోగమించుతున్నాయి. ఉత్తర ఇటలీలో గెరిల్లాలు విజృంభిస్తున్నారు; ఇటలీ సరిహద్దులోని యుగోస్లావియాలో జాతీయ స్వాతంత్ర్య సైన్యం వరుసగా విజయాలను సాధించుతోంది. రెడ్ ఆర్మీ విజయాలు ఎక్కువయిన కొద్దీ బాల్కను రాజ్యాల పాలకవర్గాలలో గందరగోళం హెచ్చింది. జర్మను–హంగేరీ సంబంధ బాంధవ్యాలు విషమించుతున్నట్లు మాస్కో రేడియో ప్రకటించింది. వీటిఅన్నిటికి తోడు మాస్కో సమావేశం నాజీ నాయకులకు సింహస్వప్నంలా వుంది. ఈపరిస్థితులూ, రెడ్ ఆర్మీ విజయాలు, జర్మనుప్రజల మనోనిబ్బరాన్ని చీల్చివేస్తున్నాయి.

గోబెల్సు–హిట్లర్ల గోల

గోబెల్స్ రష్యాయుద్ధాన్ని పేర్కొంటూ, "మహావిపత్తును" ఎదుర్కొనవలసి వుంటుందని మొత్తుకుంటున్నాడు. జర్మను సైనికబలం సన్నగిలిపోతోంది. "హిట్లరు యువకులారా! ముసలీ ముతకా–పిల్లాజల్లా ప్రోగుచేసి సైనిక సంఖ్యను ఎక్కువజేయండర్రో"అని హిట్లరు మొరపెడుతున్నాడు. అపజయ భయాన్ని యెదుర్కొనడానికి నాజీ నాయకులు మీటింగులు పెడుతున్నారు. ప్రజల మనోనిబ్బరాన్ని పెంచడానికి మతగురువుల సహాయం తీసుకొంటున్నారట. గతవారం మాస్కో రేడియో "తూర్పు యూరప్‌లోను, జర్మనీలోను, పరిస్థితులు హఠాత్తుగా విషమించవచ్చు"అని ప్రకటించింది. రష్యారంగంలో అక్కడక్కడ జర్మను సైనికులు – సైనికాధిపతులు ఒకరినొకరు కాల్చుకోడం జరుగుతున్నట్లు రెడ్ ఆర్మీకి చిక్కిన జర్మను ఖైదీలు చెప్పారు. ఈవార్త కూడ మాస్కో రేడియోయే ప్రకటించింది.

నీటిలో మునిగేవాడికి గడ్డిపరక దొరికితే పట్టుకొని బ్రతకాలని ఆశిస్తాడు. అలాగే హిట్లరు పైనచెప్పిన విషమస్థితినుండి బయట పడటానికి ఒకే ఒక ఆశ పెట్టుకు కూర్చున్నాడు. అది: రెండవరంగం రాకుండా యుద్ధం దీర్ఘంగా యీడ్చటం; మిత్రరాజ్యాలలో చీలిక తేవడం.

ఈవిషయాన్నే లండన్‌లోని సోవియట్ రాయబారి హెచ్చరించుతూ ఇలా అన్నాడు: "తూర్పు పడమరలనుండి మిత్రరాజ్యాలు సంయుక్తంగా దెబ్బకొట్టాలి. అలా కొట్టితే యుద్ధం త్వరలో ముగుస్తుంది. అనేకవేల మంది ప్రాణాలు కాపాడబడతాయి. ఆక్రమిత దేశాల ప్రజలకు విముక్తి లభిస్తుంది."

"వార్ అండ్ వర్కింగ్ క్లాసు" అనే సోవియటు పత్రిక కూడా మాస్కో సమావేశాన్ని గురించి వ్రాస్తూ, పైవిషయాన్నే తెలియపరచింది. "యుద్ధాన్ని పొడిగించాలని చూసే జర్మను ప్లానులను మాస్కో సమావేశం భగ్నంచేస్తుంది," అని ఈ పత్రిక వ్రాసింది.

అభివృద్ధి నిరోధకుల ఆట

రెండవరంగం ఇప్పుడు వద్దు అనే ప్రబుద్ధులు లేకపోలేదు. మిత్రరాజ్యాలలో చీలికలు కల్గుతాయనే హిట్లరు ఆశకు దోహదమిచ్చే అభివృద్ధినిరోధకులూ లేకపోలేదు.

అమెరికాలోని "ఆర్మీ అండ్ నేవీరిజిస్టర్" అను పత్రిక 1944 వేసవిదాకా రెండవరంగం లేదంటూ వ్రాసింది. హోర్ బెలీషా, బ్రిటన్ తనకు ఇతర దేశాలక్కరలేదని పదేపదే చెప్పిందనీ-రష్యా మాత్రం తన సరిహద్దులను మార్చాలని కోరుతున్నట్లూ నిందలువేస్తున్నాడు. సోవియటు రిపబ్లిక్ బాల్యావస్థలో నున్నప్పుడు దానిపై దండెత్తిన లార్డు కర్జన్ సైతం, పూర్వం పోలండు రష్యాలో కొంత భాగాన్ని ఆక్రమించిందని అంగీకరించారు. కాని ఇప్పుడు హోర్ బెలీషా, అతనిలాంటి సామ్రాజ్యవాదులూ అంగీకరించడం లేదు. ఇట్టి సామ్రాజ్యవాద దురహంకారంతోనే కొన్ని ఆక్రమిత దేశాలలో అంతః కలహాలను రగల్చడానికి సామ్రాజ్యవాద నిరంకుశ ప్రభువులు ప్రయత్నించుతున్నారు. లండన్ నుండి వెలువడే ఒక పోలిష్ పత్రిక, యుద్ధానికి పూర్వం ఉన్న పోలిష్ సరిహద్దులను మార్చితే రష్యాపై యుద్ధం చేస్తామంటూ బెదరించుతూవుంది. ఇలాగే గ్రీసు, యుగోస్లావియాల ప్రభుత్వాలు, ఆయా దేశాలలోని గెరిల్లా దేశభక్తులపై దండయాత్రనలుపుచున్న ద్రోహులకు "దేశభక్తులనే బురఖా" తగిలించు తున్నాయి. గ్రీసులో జర్మన్లతో సహకారం చేసే కర్నల్ జెర్వాస్‌కు గ్రీసు ప్రభుత్వం దోహదమిస్తోంది. యుగోస్లావ్ ప్రభుత్వం మిహిల్లోవిచ్‌ను ఇంకా 'దేశభక్తుడే' అంటూవుంది.

ప్రజలదే విజయం

కాని ఈ అభివృద్ధి నిరోధకుల ఆటలు సాగవు. ఇందుకు నిదర్శనం గతవారంలో ప్రకటించిన అఖిలస్లావ్ మహాసభలో ఆయా దేశభక్తులు ప్రకటించిన ప్రకటనలే. ప్రజలకూ-నిరంకుశప్రభువులకూ మధ్య అఘాతం ఈ ప్రకటనలవల్ల తెలుస్తోంది. ప్రజల ఆశయాలే నెరవేరుతాయనుటకు వారు సోవియటుతో భుజం భుజం కల్పి సాగించుతున్న పోరాటాలే నిదర్శనం. వారిలోని ఐక్యతయే నిదర్శనం. (మరొకచోట ప్రకటించిన గ్రీకు ప్రజల ప్రతిఘటనను చదవండి.)

మాస్కో సమావేశంలో ఒడంబడిక కుదిరినదని (వివరాలింకా ప్రకటించలేదు) రూజువెల్టు ప్రకటించడం, జర్మనీ తుది యాశను కూడా భగ్నం చేస్తోంది. హిట్లరుకు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో సహాయం చేస్తున్న, పైన చెప్పిన అభివృద్ధి నిరోధకుల చర్యలకుకూడా చెంపపెట్టు తగులుతోంది.

1–11–43

—తుమ్మల వెంకటరామయ్య

(2వ పేజీతరువాయి)గౌరవంకాదు అని చెప్పినప్పుడు, "సిగ్గు, సిగ్గు," అని అరచి గోలచేసినవాడు భూపతి. ఉంగుటూరు సభలో, నా ఉపన్యాసం,అయినపిదప, "జాతీయ యువజన సంఘాలకు జై, సుభాస్ బోసుకు జై" అని కేకలుపెట్టినదీ యీముఠావారే. ఉంగుటూరులోను, బందరులోను, ఫార్వర్డుబ్లాకును తీవ్రంగా విమర్శించినప్పుడు అల్లరిచేసిన ముఠా యిదే. అందుచే యీ అల్లరిముఠా జపాను అనుకూల ఫాసిస్టుముఠా అని ప్రజలు గుర్తించాలి.

రాష్ట్ర విద్యార్థి మహాసభ

19వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ నవంబరు 12, 13, 14 తేదీలలో గుంటూరులో జరుగనున్నది. మహాసభకు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షులుగాను, మోహన్ కుమారమంగళం ప్రారంభకులుగాను, కాశీపట్నం కొండయ్య, అడివి బాపిరాజు, తాపీ ధర్మారావుగారలు ఉపన్యాసకులుగాను వచ్చుటకు దయతో అంగీకరించినారు.

రాయలసీమ కరువునిధి వసూళ్ళ ఆపుదల

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావుగారు బెజవాడ నుండి యీ క్రింది విజ్ఞప్తి గావిస్తున్నారు:

రాయలసీమ కరువునిధి వసూలు చేయుట ప్రారంభించి సుమారు 7 నెలలైనది. ధన, ధాన్య, వస్త్రరూపేణ వసూలుచేయడం, క్షామ నివారణకొరకు ఖర్చుపెట్టడం జరిగింది. ఈ జమాఖర్చు రెగ్యులర్‌గా ప్రజాశక్తిలోనూ, కొన్నిదఫాలు దినపత్రికలలోనూ ప్రకటితమౌతూ వచ్చాయి.

నవంబరు 10వ తేదీతో రాయలసీమ కరువునిధివసూళ్ళు ఆపివేయబడును. అటుపిమ్మట ఎవ్వరున్నూ సంఘపక్షాన కరువునిధి వసూలు చేయువలదని కోరుచున్నాను.

నవంబరు 10 తేదీ వరకు వసూలుచేసిన సొమ్మును, బట్టలు వగైరాలను వెంటనే ఆఫీసుకు పంపకోర్తాను. ధాన్యం వసూలుచేసినచో అమ్మి ధనాన్ని పంపాలి. నవంబరు 15వ తేదీకి ఉన్న యావత్తు సొమ్మున్నూ కరువు నివారణ కమిటీలకు పంపబడును. నవంబరు 10 వరకూ వసూళ్ల జమాఖర్చులు పూర్తిగా అటుపిమ్మట ప్రకటింపబడును.

ఇంతవరకూ సంఘ విజ్ఞప్తిని మన్నించి, ధన, ధాన్య, వస్తురూపేణా కరువు బాధితులకు సహాయపడ్డ ఉదారులకు, ప్రజలకు, వసూలు చేసిన వర్కర్లకు సంఘపక్షాన, కరువుబాధితుల పక్షాన కృతజ్ఞతను వెల్లడిస్తున్నాను.

★

కామ్రేడ్ రాజేశ్వరరావుకు కఠిన శిక్ష

చల్లపల్లి జమీందారుకు – మంగళాపురం వ్యవసాయకూలీలకు మధ్య భూమివిషయమై తగాదా వచ్చింది. 21–8–42వ తేదీన జమీందారీ మనుషులకు, వ్యవసాయకూలీలకు ఘర్షణ జరిగింది. ఈసందర్భంలో 2-9-43వ తేదీన బందరు సబ్‌మేజిస్ట్రేటు కామ్రేడ్ రాజేశ్వరరావుకు (కమ్యూనిస్టుపార్టీ ఆంధ్ర కమిటీ కార్యదర్శి), మరికొందరికి 4 నెలల కఠిన శిక్ష విధించాడు.

వీరు తర్వాత జామీనుపై విడుదలచేయబడ్డారు. వీరు చేసిన అప్పీలు జిల్లాకలెక్టరు విచారించి 25–10–43వ తేదీన యీ క్రింది విధంగా శిక్ష చెప్పాడు. 144 సెక్షన్ ధిక్కారం క్రింద 3 నెలలకఠినశిక్షలకు కామ్రేడ్ రాజేశ్వరరావూ, మరి 7 గురు పార్టీ సభ్యులూ గురి అయ్యారు. వీరికే మరొక కేసు క్రింద 2 నెలల శిక్షవేశారు. మొదటి కేసులో వ్యవసాయకూలీలగు ముద్దాయిలలో పురుషులకు ఒక్కొక్కరికి 40 రూపాయలు జరిమానా లేక 2 నెలల శిక్ష, స్త్రీలకు 15 రూపాయల జరిమానా లేక 15 రోజుల శిక్ష విధించారు. రెండవ కేసులో యీముద్దాయిలకు 20 రూపాయలు జరిమానా లేక 20 రోజుల శిక్షవిధించబడింది.

బళ్లారి మహాసభల ఫలితాలు

(1వ పేజీ తరువాత) రెడ్డినాయుడు, రామస్వామి చౌదరిగార్ల మరణానికి సంతాపం తెల్పారు.

బళ్లారినగరంలోని అధికసంఖ్య ప్రజలు దానిని కన్నడ ప్రాంతమని నిర్ణయించితే ఎవరూ అందుకు అభ్యంతరపెట్టలే రన్నారు. సభను బళ్లారిలో జరిపినంతమాత్రాన ఆంధ్రుల దని హక్కు ఏర్పడదని కన్నడ సోదరులకు జ్ఞాపకం చేశారు.

ప్రపంచ పరిస్థితులను, మిత్రమండలి విజయాలను వివరించుతూ, జపానుపైకి యుద్ధతంత్రంలో ఇండియా ప్రధానాశ్రయం కాబోతుందన్నారు. దీనివలన భారత దేశానికి ప్రయోజనం వుందని ఆశించుతామన్నారు. జపానుకు వ్యతిరేకంగా తీవ్రమైనయుద్ధం సాగించడానికి భారత సహకారం అవసరమనీ, అందుచే కొత్త వైస్రాయి రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రయత్నించుతాడని ఆశించుతానన్నారు. అందుకు 1. రాజకీయ బంధితులను విడుదల చేయాలన్నారు. 2. కాంగ్రెసుతో రాయబారాలు అవసరమన్నారు 3. జాతీయోద్యమానికి వ్యతిరేకంగా మతవిభేదాలను (కమ్యూనలిజం) రెచ్చగొట్టమని బ్రిటిషుప్రభుత్వం ప్రకటించాలన్నారు. [దీనినే కమ్యూనిజానికి దోహదమీయమని ప్రకటించాలన్నట్లుగా 'ఆంధ్రప్రభ' తప్పు అనువాదం చేసింది.] 4. అట్లాంటిక్ ఛార్టరును ఇండియాకు అనువర్తింపజేయాలన్నారు. 5. క్రిప్స్ ప్రతిపాదనల నాధారంగా తీసికొని జాతీయప్రభుత్వ మేర్పరచాలన్నారు. 6. బర్మాకు, మలయా వగైరా జపాన్ ఆక్రమిత దేశాలకు యిపుడే స్వాతంత్ర్యం ప్రకటించాలన్నారు.

తరువాత సర్ విజయా మహాసభ చేసిన పనిని వివరించారు. బడ్జెటును విభజించడానికి ప్రభుత్వంతో తాము జరిపిన రాయబారాలను గురించి తెలిపారు. యుద్ధం మూలంగా పని యెడతెరపిలేకుండా వుండుటచేతను, కాగితం కరువువల్లను, యిది ప్రస్తుతం సాధ్యంకాదని ప్రభుత్వం సాకు చెప్పిందన్నారు. తరువాత క్రిప్స్‌వద్దకు వెళ్ళిన తమ రాయబారంగురించి విజయాగారు తెల్పారు. క్రిప్స్ భాష, విజ్ఞానాలనుబట్టి రాష్ట్ర విభజనకు తాను సుముఖుడనే అని సోవియట్ ఉదాహరణలు చెప్పాడు. కాని, దేశంలో చీలికలు, అంతఃకలహాలు తేవడానికి ప్రయత్నిస్తున్నదని బ్రిటన్‌పై గోల బయలుదేరిందనీ, అందుచే వీలుపడదనీ క్రిప్స్ చెప్పాడు.

ఆంధ్ర శాసనసభ్యులు బడ్జెటు విభజనకు తగినంత కృషి చేయలేదనీ, యితరులపై నింద వేయడం సరిగాదనీ ఆక్షేపించారు. కొత్తఎన్నికలలో ఆంధ్రరాష్ట్రంకొరకు పోరాడుతామని శపథం చేసినవారినే యెన్నుకోవాలనీ, అందుకొరకు ఒకప్లాను వేయాలనీ హెచ్చరించారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ప్రజల సమస్యల పరిష్కరించడానికి కృషిచేస్తుందన్నారు. ఇంతవరకు ఉపేక్షాభావంతో వదలివేయబడిన రాయలసీమవారికి రాష్ట్రంవస్తే హెచ్చులాభప్రదమౌతుందన్నారు.

"ఆంధ్రులు చరిత్రలోనూ, విజ్ఞానంలోనూ, జాతీయ శీలసంపదలోనూ, రాజకీయాలలోనూ, ఎవరికీ తీసిపోరు. సంఖ్యనుబట్టి భారత దేశంలో మూడవస్థానం ఆక్రమించుతాం. దేశభాషలందు తెలుగులెస్స. మన భూమి ఆర్థికాభివృద్ధికి సర్వ సౌకర్యాలు కల్గిననేల. మన పూర్వులు రాజ్యాలను స్థాపించారు. నాగరికతను నిర్మించారు. వారి సాంప్రదాయాలను ముందుకు తీసుకుపోదామని" విజయాగారు ఉపన్యాసం ముగించారు.

తీర్మానాలు

25వ తేదీ ఉదయం మరల మహాసభ సమావేశమయింది. కీర్తిశేషులైన ప్రముఖులను గురించి ముందు తీర్మానం చేయబడింది. తరువాత రాజకీయ తీర్మానాన్ని కోటంరాజు రామారావుగారు ప్రవేశపెట్టారు. దీనిలో అధ్యక్షుని ఉపన్యాసంలో సూచించబడిన రాజకీయ ఖైదీల విడుదల, జాతీయ ప్రభుత్వ స్థాపన, వగైరా ఆరుపాయింట్లు పునరుల్లేఖించబడ్డాయి. ప్రతిష్టంభనా పరిష్కారానికి పూనుకోవాలని బ్రిటీష్ ప్రభుత్వాన్ని హెచ్చరించుతూ తీర్మానించారు. రామారావుగారు ఉపన్యాసంలో "కార్యాచరణదక్షుడైన వేవెల్ ప్రభువు" పరిష్కారానికి మరొక ప్రయత్నం చేస్తాడని తామాశించుతామన్నారు.

తరువాత ప్రతాపగిరి సుబ్బారావుగారు రాయలసీమ తీర్మానం ప్రతిపాదించారు. తుంగభద్ర, సంగమేశ్వర ప్రాజెక్టుల కొరకు తీవ్రమైన ఆందోళన చేయాలనీ, వాటికి అయ్యేఖర్చు కొత్తగా ఏర్పడే ఆంధ్రరాష్ట్ర ఆదాయ-వ్యయములపై మొదటి చార్జీగా వుంటుందనీ, వాగ్దానం చేయబడింది. శాసనసభలోనూ, కాబినెట్‌లోనూ రాయలసీమ వాసులకు ప్రాతినిధ్యము సమకూర్చుటలో శ్రీ బాగ్ ఒడంబడికకు కట్టుపడివుంటామని తీర్మానించబడింది. రాయలసీమ అభివృద్ధికి పంచవర్ష ప్రణాళికను ఆర్థిక శాస్త్రజ్ఞుల సహాయంతో తయారుజేసి అమలు జరపాలని కోరారు. సర్కారుల-రాయలసీమ ప్రజల మధ్య సన్నిహిత సంబంధం ఏర్పరచడానికి మహాసభ ప్రయత్నించాలని తీర్మానించబడింది.

రాత్రి 7 గంటలకు జరిగిన సమావేశంలో మద్రాస్ రేడియోవారి ప్రోగ్రామ్‌లలో ఆంధ్రులకు అన్యాయం జరుగుతోందనీ, ఆంధ్ర భాషకు, ఆర్టిస్టులకు హెచ్చు అవకాశాలు యివ్వాలని కోరుతూ పర్వతనేని వీరయ్య చౌదరిగారు తీర్మానాన్ని ప్రతిపాదించారు. తీర్మానం ఏకగ్రీవగా ప్యాసయింది. ఆంధ్రుల చరిత్రను వ్రాయించుటకు బెజవాడ రామచంద్రారెడ్డిగారు అధ్యక్షులు గాను, మారేమండ రామారావు కార్యదర్శిగాను సబ్ కమిటీ నియమించబడింది.

రాయలసీమ క్షామనివారణనిధిని వసూలు చేసినందుకు విజయాగారికి కృతజ్ఞత తెలుపుతూ తీర్మానించబడింది. బొంబాయిలో క్షామనిధి వసూలు చేస్తున్న కొండా వెంకటప్పయ్యగారికి, విరాళముల నొసగిన దాతలకు, వందనములు అర్పించుతూ తీర్మానం చేయబడింది.

సరిహద్దుల నిర్ణయ ఉపసంఘం

"ఆంధ్రరాష్ట్ర స్థాపనకు వీలుకలుగ చేయుటకు భవిష్యదాంధ్రరాష్ట్ర సరిహద్దుల నిర్ణయ మవసరము గనుక, ఆంధ్రజనాభాను గురించి లెఖ్ఖలను సేకరించుటకు, ఇతర సాక్ష్యమును తయారు చేయుటకూ, భాషా ప్రయుక్త రాష్ట్ర స్థాపనా సిద్ధాంతము ననుసరించి సరిహద్దుల నిర్ణయించుటకూ," సర్ ముత్తా వెంకటసుబ్బారావు, బులుసు సాంబమూర్తి, బొబ్బిలిరాజా, హరిసర్వోత్తమరావు, కోటిరెడ్డిగార్లుగల ఒక ఉపసంఘాన్ని నియమించుతూ తీర్మానించింది.

కార్యవర్గ సభ్యులను అధ్యక్షుడే నియమించాలను తీర్మానం తీవ్రమైన చర్చలు జరిగాక ఆమోదించబడింది. ప్రాథమిక సభ్యత్వరుసుం నాలుగణాలనుంచి అణాకు తగ్గించాలని మహాసభ నిబంధనలు సవరించబడ్డాయి.

ఫలితాలు

ఆంధ్రమహాసభ పూర్తి అయింది. ప్రతినిధులంతా తమ యిండ్లకు చేరుకున్నారు. బళ్ళారి మహాసభ ఫలితాలేమిటి? చేసిన తీర్మానాలు, యిచ్చిన ఉపన్యాసాలు ఏమి తెలియజేస్తున్నాయి?

(1) ఆంధ్ర రాష్ట్రం అక్కర లేదనీ, రాయలసీమ ఆర్థికాభివృద్ధికి సత్వర ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం వ్యతిరేకమనీ, వాదించుతున్న ఆంధ్ర జాతీయతకు విరుద్ధులైనవారికి ఎట్టి పలుకుబడి లేదని రుజువయింది. వారు ప్రజలకు దూరమయ్యారు. ఆంధ్రులంతా ఆంధ్ర రాష్ట్రాన్ని, రాయలసీమ ఆర్థికాభివృద్ధిని, కూడ కోరుతున్నారని స్పష్టపడింది. తుంగభద్ర, సంగమేశ్వర ప్రాజెక్టులకు అయ్యే ఖర్చు రాబోవు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ బడ్జెటుపై ప్రథమ చార్జీగా వుంటుందను తీర్మానమే ఇందుకు నిదర్శనం.

(2) రాబోయేఎన్నికలకు ఆంధ్రమహాసభ తరపున ప్రతినిధులను నిలపాలనే అధ్యక్షుని ఉపన్యాసంలోని సూచన సరియైనదికాదు. ఆసూచన అమలుజరిగితే ఆంధ్రమహాసభ ఆంధ్రులందరి సంస్థగా ఉండటానికి బదులు, ఒక రాజకీయ పార్టీగా తయారవుతుంది. స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకులు ఆంధ్ర మహాసభ పేరుతో దెబ్బతిన్న తమపార్టీలను, సంకుచిత రాజకీయాలను, పునరుద్ధరించుకోవడానికి చేసే ప్రయత్నాలకు అవకాశమిస్తుంది. ఆంధ్రులంతా రాష్ట్రాన్ని కోరుతున్నారు. అందుచే ఆంధ్రమహాసభ అన్ని పార్టీలతో కూడిన సంస్థగా వుండాలి. దానిని ఒక పార్టీగా చేయడం సరియైన పద్ధతికాదు. చీలికలు కలుగజేస్తుంది.

(3) సరిహద్దులను నిర్ణయించుటకు ఉపసంఘాన్ని నియమించుతూ చేసిన తీర్మానం కన్నడ సోదరులలో మరింత అనుమానాలు రేకెత్తించుతుంది. ఇదివరకే ఉకుమళ్ళ రామచంద్రరావు వాదనలు (16 వ తేదీ ఆంధ్రపత్రికలోని వ్యాసం) సోదరజాతుల ప్రజల మధ్య సందేహాలను మరింత రెచ్చగొట్టాయని ప్రారంభంలో తెలిపాను. మనలోని వితండవాదులు బళ్ళారి జిల్లా అంతా మనదే అని వాదించడం కేల్కార్ అవార్డుకు వ్యతిరేకంగా సరిహద్దు తగవును లేవదీయడం కన్నడ ఉద్యమంలోని వితండవాదులకు దోహదమిచ్చింది. 24 వ తేదీని జరిగిన జిల్లా కర్నాటక యువజన మహాసభ తీర్మానాలే యిందుకు నిదర్శనం. ఆసభలో జాతీయ దురహంకారాన్ని, దెబ్బకు దెబ్బతీయాలనే ప్రతికక్షను, సభ్యులలో వితండవాదులు కలుగజేయగలిగారు. బళ్ళారిజిల్లా అంతా తమదేనని, అనంతపూర్ - కర్నూల్ జిల్లాలలో భాగాలు తమకు రావాలనీ, వాదన లేవదీశారు. రాబోయే సంయుక్త కర్నాటక మహాసభను ఆదోనిలో జరపాలని తీర్మానించారు.

సరిహద్దులను నిర్ణయించడ మనేది రెండు జాతులూ అంగీకరించే నిష్పాక్షిక విచారణ సంఘంద్వారా జరగాలనే విషయం శాంతంగా ఆలోచించే వారందరూ అంగీకరించుతారు. అలాంటప్పుడు ఆంధ్రమహాసభ తరపున ఒక సరిహద్దు నిర్ణయ సబ్‌కమిటీని ఏర్పరచడంలో అర్థంలేదు. దీనికి ప్రతిద్వందిగా, కన్నడ ప్రాంతాలను మనం కాజేయడానికి కుట్ర పన్నుతున్నామని కన్నడులలోని జాతీయదురహంకారులు ప్రజలను ఉద్రేకపరుస్తారు. ఫలిత మేమిటంటే ఆంధ్రులలోనూ, కన్నడులలోను, అనవసర ద్వేషాలు పెరుగుతాయి, సోదరప్రజలమధ్య పోరాటాలుతీవ్రమౌతాయి.

అందుచే సోదర కన్నడ ప్రజలకు ఒక మనవి. కాంగ్రెసుచే నిర్ణయించబడిన కేల్కారు అవార్డును వుభయులం ప్రస్తుతానికి అంగీకరించుదాం. సరిహద్దుల విషయమై ఆందోళనం అన్నదమ్ముల తగవు, శాంతవ్యంకాదు, రాష్ట్ర విభజన జరుగునపుడు ఉభయులకు అంగీకృతమైన నిష్పాక్షిక కమిటీ విచారించి అన్ని సరిహద్దులను నిర్ణయించుతుంది. ఇప్పటికి కేల్కార్ అవార్డుకే కట్టుబడివుందాము. సరిహద్దుల విషయమై నేడు తగవులాడటం అద్దంలోని చంద్రుని కొరకు దేవులాడుట వంటిది. కన్నడ సోదరులు కోరుతూన్న సంయుక్త కర్ణాటక నిర్మాణానికి, ఆంధ్రులు వాంఛించుతున్న సత్వర రాష్ట్ర నిర్మాణానికి, కూడ యిది విరుద్ధమే. సోదర జాతులమధ్య తగవు పెంచుకోవడం మన బానిసత్వాన్ని బలపరుస్తుందేగాని, అందరంకోరే స్వాతంత్ర్యం దగ్గరకు రాదు. కన్నడులం, ఆంధ్రులం అందరం కలసి ప్రత్యేకరాష్ట్రాలకొరకు, ఆర్థికాభివృద్ధికొరకు, భారతస్వాతంత్ర్యంకొరకు, కృషిచేద్దాం.

గ్రామైక్యతకు అపూర్వ విజయం

పెడన బందరు తాలూకాలోని పెద్ద గ్రామాలలో ఒకటి. జనాభా 11 వేలకుపైగా వుంటుంది. వీరిలో 3 వేలమంది ముస్లిములు.

ఈసంవత్సరమే పెడనలో పంచాయితీ కోర్టు స్థాపించబడింది. జూన్‌నెలలో యెన్నికలు జరిగాయి. అప్పటినుంచీ ఊళ్ళో హడావిడి, కులతత్వాలమీద కక్షలు, బయల్దేరాయి. గ్రామమంతా రెండుపార్టీలుగా చీలిపోయింది. ఎన్నికలు సరిగా జరగలేదని ఒకపార్టీవారు పిటీషన్ పెట్టగా, సెప్టెంబరులో తిరిగి ఎన్నికలకు వాయిదా పడింది. రెండుపార్టీలవారు తీవ్రంగా పోటీచేశారు. గలాటా జరగడంవల్ల ఎన్నికలు ఆగిపోయాయి. ఇరుపక్షాలలోను ద్వేషం, పట్టుదల ఎక్కువయాయి. మూడవసారి యెన్నికలు మొన్న అక్టోబరు 16 వ తేదీని జరగాలి.

అంతవరకూ యీఘటనలను చూస్తూ తటపటాయిస్తూన్న రైతు యువకులు యీసారి రంగంలో ప్రవేశించి, గ్రామైక్యతను కాపాడటానికి ఉభయపక్షాలవారితోను సంప్రదింపులు జరిపారు. రాజీ ప్రయత్నాలలో శ్రీ చలసాని సూర్యప్రకాశరావుగారు స్థానిక యువకులకు సహాయంచేశారు. వీరందరి కృషి ఫలితంగా, రెండుపార్టీలవారికి రాజీపడాలనే ఆసక్తి బయలుదేరింది. ఒక్కొక్కపార్టీ 5 గురు పెద్ద మనుష్యుల్ని యెన్నుకొని, యీ పదిమంది తమకు మధ్యవర్తిగా కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యదర్శిని ఆహ్వానించారు. 15 వ తేదీని, అనగా యెన్నికకు తొలిరోజున, సంయుక్త కమిటీ సమావేశమయింది. ఉభయపార్టీలవారు తమతమవాదనలను బలపరచుకొంటూ, పరిష్కారానికి ఎవరి సూచనలు వారుచేశారు. రాజగోపాలరావుగారు ఉభయపార్టీల వాదనలు విని, మరునాడు యెన్నికలలో నిలబడుటకొక లిస్టును ప్రతిపాదించారు. దీనికిఅందరూ ఏకగ్రీవంగా సమ్మతించారు. ఇలాగే ప్రెసిడెంటు యెన్నికవిషయంలో కూడా మధ్యవర్తి నిర్ణయానికే బద్ధులమైయుంటామని వాగ్దానం చేశారు. సంవత్సరానికొక ప్రెసిడెంటు మారుతూవుండాలనీ, ఒక్కొక్కసంవత్సరం ఒక్కొక్క గ్రూపుకు ప్రాతినిధ్యం యివ్వాలనీ, రాజగోపాలరావుగారు నిర్ణయించారు.

16 వ తేదీని ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE